

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | ఆదివారం 01 ఆగస్టు 2021 | సంపుటి : 02 | సంచిక :365 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను పెంచాలి : మోదీ



న్యూఢిల్లీ : భారత దేశంలో పోలీసు వ్యవస్థపై వ్యతిరేక అభిప్రాయం ఉందని, ఈ వ్యవస్థ ప్రతిష్ఠను మెరుగుపరిచేందుకు అధికారులు కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కోవిడ్-19 మహమ్మారి ప్రారంభంలో ఈ వ్యతిరేక ప్రజాభిప్రాయం తాత్కాలికంగా మారిందని చెప్పారు. అయితే మళ్ళీ పాత పరిస్థితులే పునరావృతమవుతున్నాయన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ ప్రొబేషనర్లతో వర్చువల్ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. భారత దేశం ప్రస్తుతం చరిత్రలో చాలా ముఖ్యమైన దశలో ఉందని చెప్పారు. ఇటువంటి సమయంలో పోలీసులు తమ వ్యవస్థ పేరు, ప్రతిష్ఠలు మెరుగుపడటానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్)ను ఉదాహరణగా చూపించారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అందజేసే సేవలపై ప్రజలకు గొప్ప నమ్మకం ఉందని చెప్పారు. గడచిన 75 ఏళ్ళలో పోలీస్ శిక్షణను మెరుగుపరచడానికి భారత దేశం కృషి చేసిందన్నారు. దీనికోసం భవిష్యత్తులో మరింత మెరుగైన నిబంధనావళిని విధించే విషయాన్ని పరిశీలించాలన్నారు. "దేశానికే పెద్ద పీట, ఎల్లప్పుడూ మొదటి స్థానంలో" అనే మంత్రాన్ని మరోసారి వినిపించారు. ఐపీఎస్ ట్రైనీలు స్థానికంగా ఎదురయ్యే సమస్యలు ఏవైనప్పటికీ, ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బాధ్యతాయుతమైన పోలీసింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం దశాబ్దాల తరబడి కొనసాగుతున్న తప్పుడు విధానాలను, సంప్రదాయ కట్టుబాట్లను ప్రతి రోజూ తమ విధి నిర్వహణలో ఎదిరించవలసి ఉంటుందని చెప్పారు. "మీరు వ్యవస్థను మార్చుతారా? లేదంటే మిమ్మల్నే వ్యవస్థ మార్చుతుందా? అనేది మీ ఆలోచనా విధానంపైనే ఆధారపడి ఉంటుంది. అనేక విధాలుగా ఇది మీ ముందు పెట్టిన మరొక పరీక్ష" అని చెప్పారు. ఈ సందర్భంగా ఐపీఎస్ ట్రైనీలు పోలీస్ అకాడమీలో తమ అనుభవాలను మోదీకి వివరించారు. ప్రొబేషనర్లతో మోదీ మాట్లాడుతూ వారి అలవాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. తమ అధికార పరిధిలోని భద్రతా పరిస్థితులతో ఏ విధంగా వ్యవహరించాలనుకుంటున్నదీ అడిగారు. వ్యక్తిత్వ లక్షణాలు, నేపథ్యాల నుంచి వచ్చిన అనుభవం వంటివాటిని ఉపయోగించి ఏ విధంగా పని చేస్తారో అడిగి తెలుసుకున్నారు.

## ఒడిశా కూలీలు మృతి.. సీఎం జగన్ మానవతా దృక్పథం

### కూలీల కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున పరిహారం ప్రకటన



గుంటూరు: రేపల్లె మండలం లంకెవాని దిబ్బలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు కూలీల మృతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మావనతా దృక్పథంతో స్పందించారు. మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున పరిహారం అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.బతుకు తెరువు కోసం ఒడిశా నుంచి మన రాష్ట్రానికి వచ్చి అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు మానవతా దృక్పథంతో సాయం అందించాలని సీఎం తెలిపారు. రొయ్యల చెరువు యాజమాన్యం నుంచి కూడా మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందేలా చూడాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.పగలంతా కాయకష్టం చేసి ఆదమరిచి నిద్రిస్తున్న ఆరుగురు యువకులు నిశిరాత్రి వేళ అగ్నికి ఆహుతయ్యారు. ప్రమాదం నుంచి మరో నలుగురు తప్పించుకుని క్షేమంగా బయటపడ్డారు. లంకెవానిదిబ్బ గ్రామంలోని రొయ్యల చెరువుల వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకున్న సంగతి విదితమే.



పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాలోని రాయగఢ్ జిల్లా గునుపూర్ మండలానికి చెందిన 25 మంది యువకులు లంకెవానిదిబ్బలోని మండలి బెయిలీ అనే వ్యక్తికి చెందిన రొయ్యల చెరువుల్లో పని చేసేందుకు 15 రోజుల క్రితం వచ్చారు. చెరువుల వద్ద ఉన్న షెడ్లలోనే వారంతా మకాం ఉంటున్నారు. ఎప్పటిమాదిరిగానే గురువారం చెరువుల్లోని రొయ్యలకు మేత వేశారు.రాత్రి వారంతా భోజనాలు చేసి షెడ్లలోని రెండు గదుల్లో నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి వేళ షెడ్‌లోని ఒక గదిలో అకస్మాత్తుగా పొగలు కమ్ముకుని పేలుడు సంభవించగా, అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. ఆ గదిలో 10 మంది నిద్రిస్తుండగా.. మంటల్లో చిక్కుకుపోయిన నబీన్ సబార్ (23), పండబూ సబార్ (18), మనోజ్ సబార్ (18), కరుణకార్ సబార్ (18), రామ్మూర్తి సబార్ (19), మహేంద్ర సబార్ (20) అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు.

## మైనింగ్ మాఫియా ఆటకట్టిస్తాం: అశోక్‌బాబు

అమరావతి: వైసీపీ ప్రభుత్వం ప్రకృతి వనరుల దోపిడీలో మునిగితేలుతోందని తెలుగుదేశం కేంద్ర కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మట్టి, ఇసుక, బాక్సైట్, లాటరైట్, సిలికాన్ వంటి వాటిపై వైసీపీ నేతల కన్నుపడిందన్నారు. వైసీపీ నేతలు తమ దోపిడీ కోసం పోలవరం కాలువలను కూడా తవ్వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మైనింగ్ మాఫియా ఏ స్థాయిలో విరుచుకు పడుతుందో చెప్పడానికి ఎన్జీటీ తీర్పే నిదర్శనమన్నారు. విశాఖ మన్యంలో జరుగుతున్న బాక్సైట్ తవ్వకాలపై సవివరమైన నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని ఎన్జీటీ కోరిందన్నారు. ప్రభుత్వ నివేదికతో పాటు, ఐదుగురు సభ్యులను నియమించి, వారి నివేదిక కూడా



కోరిందన్నారు. ఎన్జీటీ తీర్పు వచ్చాక సాధారణంగా ఏ ప్రభుత్వమైనా మైనింగ్ నిలిపేస్తుందని కానీ జగన్ ప్రభుత్వం తవ్వకాలను మరింత ఉధృతం చేసిందన్నారు. కొండపల్లి మైనింగ్ ప్రాంతానికి టీడీపీ వారిని వెళ్లకుండా ఈ రోజు అడ్డుకున్న ప్రభుత్వం, భవిష్యత్‌లో ఎలా అడ్డుకుంటుందో చూస్తామన్నారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించైనా సరే రాష్ట్రంలోని మైనింగ్ మాఫియా ఆటకట్టిస్తామని హెచ్చరించారు. మైనింగ్ మాఫియా ఆగడాలు, దుశ్చర్యలపై కేంద్రానికి, ఎన్జీటీకి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని అశోక్‌బాబు తెలిపారు.

## భయానక ఉగ్రవాదిని మట్టుబెట్టిన భద్రతా దళాలు



న్యూఢిల్లీ : జమ్మూ-కశ్మీరులో ఉగ్రవాదంపై భద్రతా దళాలు గొప్ప విజయం సాధించాయి. అత్యంత భయానక ఉగ్రవాది ఇస్మాయిల్ భాయ్ వురపు లంబును శనివారం మట్టుబెట్టాయి. లంబు నుంచి ఓ ఏకే-47 రైఫిల్, ఓ ఎం-4 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడి కోసం ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఈఐడీ)ని లంబు తయారు చేశాడని తెలుస్తోంది.కశ్మీరు ఐజీపీ విజయ్ కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన అత్యున్నత స్థాయి పాకిస్థానీ ఉగ్రవాది లంబూ ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు ధ్రువీకరించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మరొక ఉగ్రవాది కూడా మరణించాడని, అతని వివరాలను ఇంకా తెలుసుకోవలసి ఉందని చెప్పారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, లంబు 2018 డిసెంబరులో కశ్మీరులో ప్రవేశించాడు. పుల్వామాలోని ట్రాల్ ప్రాంతంలో లంబు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. శ్రీనగర్ నుంచి 46 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో ఉగ్రవాదం ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మరణించిన ఉగ్రవాది ఇస్మాయిల్ భాయ్ ఎత్తు ఆరున్నర అడుగులు కావడంతో అతనిని తోటి ఉగ్రవాదులు లంబు అని పిలుస్తారని అధికారులు చెప్పారు. ఇతనిని మోనికర్ ఫౌజీ బాబా అని కూడా పిలుస్తారని చెప్పారు. జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ నెట్‌వర్క్ కశ్మీరులో బలహీనపడుతోందని, దీనిని బలోపేతం చేయడానికి లంబును ఆ ఉగ్రవాద సంస్థ కశ్మీరుకు పంపించినట్లు తెలుస్తోంది. ఐఈడీలను తయారు చేయడంతోపాటు కొత్త ఉగ్రవాదులను చేర్చుకోవడం కోసం ఇతనిని పంపించినట్లు సమాచారం.

## సహకార సంఘాల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణలో సులభతర విధానంలో భాగంగా సహకార సంఘాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ-సహకార సేవ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించారు. అందులో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. ఈ మేరకు సహకార సంఘాల రిజిస్ట్రార్ వీరబ్రహ్మయ్య దీపిపి అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రజల ఎవరైనా ఈ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964, పరస్పర సహకార సంఘాల చట్టం 1995 ద్వారా సహకార సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ప్రజలు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయగానే నిబంధనల ప్రకారం అన్ని అంశాలను పరిశీలించి ఆన్‌లైన్ లోనే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, సంబంధిత రిజస్టర్డ్ బైలాలను రిజిస్ట్రార్, జిల్లా సహకారం అధికారి దరఖాస్తు దారునికి ఆన్‌లైన్‌లోనే పంపించనున్నట్టు అధికారులు తెలిపారు. కాబట్టి ప్రజలు సమిష్టి వ్యక్తుల శ్రేయస్సు, అభివృద్ధి కోసం సంఘకార సంఘాలను ఏర్పాటు చేసుకుని తెలంగాణ సహకార శాఖ అందిస్తున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకోవాలని సహకార శాఖ కమిషనర్ వీర బ్రహ్మయ్య తెలిపారు.

## రెండు వారాల్లో 40 పనిగంటలు కోల్పోయిన రాజ్యసభ

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రెండు వారాల్లో పెద్దల సభ (రాజ్యసభ) పనిగంటల సక్రమ వినియోగం గణనీయంగా పడిపోయింది. మొత్తం 50 పని గంటల్లో 40 పనిగంటలను సభ కోల్పోయినట్టు అధికార ప్రకటన వెల్లడించింది. "సభా కార్యక్రమాల అంతరాయం కొనసాగుతుండటంతో పని గంటల వినియోగం గణనీయంగా పడిపోయింది. తొలి వారంలో 32.20 శాతంగా ఉన్న పనిగంటల వినియోగం, రెండోవారంలో 13.70 శాతానికి పడిపోయింది. సరాసరి ప్రొడక్టివిటీ రేటు 21.60కు చేరింది. మొత్తం 50 పనిగంటల్లో 39 గంటల 52 నిమిషాల పని గంటలను సభ కోల్పోయింది. అయితే షెడ్యూల్ సమయం కంటే ఒక గంట 12 నిమిషాలు ఎక్కవగానే సభ నిర్వహించినప్పటికీ ప్రొడక్టివిటీ మాత్రం మొత్తం మీద తగ్గింది" అని ఆ ప్రకటన పేర్కొంది.కోవిడ్ సంబంధిత అంశాలపై 4 గంటల 37 నిమిషాల పాటు చర్చించగా, మొదటివారంలో ఐటీ మంత్రి పెగాసస్ స్పైవేర్‌పై ప్రకటన చేశారని తెలిపింది. ఇంతవరకూ మెరైన్ ఎయిడ్స్ టు నావిగేషన్ బిల్లు-2021, జ్యువనైల్ జస్టిస్ అమెండ్‌మెంట్ బిల్లు 2021, ఫ్యాక్టరింగ్ రెగ్యులేషన్ (సవరణ) బిల్లు 2021, కోకోనట్ డవలప్‌మెంట్ బోర్డ్ (సవరణ) బిల్లు 2021 సభామోదం పొందాయి. లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్ (అమెండ్‌మెంట్) బిల్లు 2021, డిపాజిట్ ఇన్స్యూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (అమెండ్‌మెంట్) బిల్లు 2021తో సహా మొత్తం 4 బిల్లులు రాజ్యసభలో ప్రవేశపెట్టారు.



## సహకార సంఘాల అభ్యున్నతికి చర్యలు: మంత్రి కన్నబాబు

విజయవాడ: సహకార సంఘాల అభ్యున్నతికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కన్నబాబు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అప్కోబ్, సహకార శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. ఆడిట్ విధానాన్ని బలోపేతం చేయడం , పూర్తి స్థాయిలో సహకార సంఘాల కంప్యూటీకరణ , మానవ వనరుల పాలసీ తదితర నిర్ణయాలను తీసుకున్నామని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత అప్కోబ్ చాలా ఒడిదుడుకులను చూసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చే నాటికి నాలుగు జిల్లాల్లో సహకార కేంద్ర బ్యాంకులు నష్టాల్లో ఉండేవన్నారు. జగన్ ప్రభుత్వ పారదర్శక నియమాలు, నియంత్రణ , ఇతర చర్యల వల్ల నేడు అన్ని జిల్లాల డీసీసీబీలు లాభాల బాటలో పడ్డాయన్నారు.ఈ ఏడాది 31




వేల కోట్ల రూపాయిల టర్నోవర్‌ను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అప్కోబ్‌లో ప్రతి రూపాయి రైతు కష్టమేనని స్పష్టం చేశారు. అత్యంత బాధ్యతగా , నిజాయితీగా రైతు డబ్బును మనమంతా కాపాడాలని సూచించారు.నిధుల దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గుంటూరు సహా పలు జిల్లాల డీసీసీబీలు చాలా బాగా నడుస్తున్నాయన్నారు. రైతుకు, చిరు వ్యాపారస్తులకు ఉపయోగపడేలా వివిధ స్కీములను అమలు చేస్తున్నామన్నారు.డ్వాక్రా సంఘాలకు అప్పులిచ్చే కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల నియమితులైన అన్ని జిల్లాల డీసీసీబీ చైర్మన్లకు, డీసీఎంఎస్ చైర్మన్లకు మంత్రి కన్నబాబు అభినందనలు తెలిపారు.

## దేశ చరిత్రలోనే ఇది సువర్ణ అధ్యాయం: పేర్నినాని

### బీసీలను చంద్రబాబు మోసం చేశారు

### సీఎం జగన్ పాలనను అన్నివర్గాలు స్వాగతిస్తున్నారు

### మంత్రి పేర్ని నాని

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సమతుల్యతను పాటిస్తున్నారని, దేశ చరిత్రలోనే ఇది సువర్ణ అధ్యాయం అని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. శనివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 50 శాతానికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని తెలిపారు.సీఎం జగన్ పాలనను అన్నివర్గాలు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. తమది బీసీల పార్టీ అని చెప్పుకునే చంద్రబాబు వారిని మోసం చేశారన్నారు. చంద్రబాబు హయాంలో రాజ్యసభ స్థానాలన్నీ అగ్రవర్ణాలకే ఇచ్చారని.. ఐదేళ్లలో ఒక్క రాజ్యసభ స్థానం కూడా బీసీలకు ఇవ్వలేదని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు బీసీలు గుర్తుకురారని మండిపడ్డారు."మైలవరంలో అలజడి సృష్టించేందుకు దేవినేని ఉమ ప్రయత్నించారు. కుట్రలో భాగంగానే వివిధ వర్గాలను రెచ్చగొట్టారు. ఉమ అనుచరుల చేతిలో గాయపడ్డవాళ్లే కేసులు పెట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకే పోలీసులు కేసులు నమోదు చేశారని" పేర్నినాని అన్నారు.



## సంపాదకీయం

ఆదివారం 01 ఆగస్టు 2021

# అప్పట్లో ప్లేగు.. నిన్న కరోనా..

కరోనావైరస్ వచ్చి మనుషుల లైఫ్‌స్టైల్ మొత్తాన్ని మార్చేసింది. స్కూళ్లు లేవు.. ఆఫీసులు లేవు.. సినిమాలు లేవు.. షికార్లు లేవు.. అన్నీ ఇంటి దగ్గరే అయిపోయాయి. జీవితం మొత్తం మారిపోయింది. కొవిడ్ వచ్చి దాదాపు ఏడాదిన్నర అవుతున్నా.. ఇంకా ఈ వైరస్ వణికిస్తూనే ఉంది. ఇంకెన్ని రోజులు ఇలాగే భయపెడుతుందో ! దీనికి అంతమెప్పుడో చెప్పలేని స్థితి. మనుషులపై ఇలాంటి మహమ్మారులు విరుచుకుపడటం ఇదే మొదటిదేమీ కాదు.. గతంలో ఇలాంటి మహమ్మారులు చాలామంది జీవితాలను బలితీసుకున్నాయి. భవిష్యత్తులోనూ ఇలాంటి మరో మహమ్మారి రాదని చెప్పలేం ! ఈ వైరస్‌ను చైనా ల్యాబ్‌లో తయారు చేసిందని వాదనలు ఉన్నాయి.. అది ఎంతవరకు నిజమో ఇంకా నిర్ధారణ కాలేదు.. కానీ గతంలో వచ్చిన మహమ్మారులు మాత్రం వాటంతట అవే పుట్టుకొచ్చాయి. మరి ఈ వైరస్‌లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అవి ఎలా పుట్టుకొస్తున్నాయి? వాటి పుట్టుకకు కారణమేంటి? అనే సందేహాలు మాత్రం చాలామందిలోనే ఉన్నాయి. ఇదే సందేహం వచ్చిన ఇంటర్ గవర్నమెంటల్ ప్లాట్‌ఫామ్ ఆన్ బయోడైవర్సిటీ అండ్ ఎకోసిస్టమ్ సర్వీస్ ( ఐపీబీఈఎస్ ) పరిశోధన చేసిన ఒక నివేదిక విడుదల చేసింది.. మరి ఆ నివేదికలోని వివరాలు ఏంటో ఒకసారి చూద్దామా..ఇప్పటివరకు మనుషులకు సోకిన వ్యాధుల్లో చాలావరకు జంతువులు, పక్షుల నుంచే వ్యాపిస్తున్నాయి. జంతువులు, పక్షుల్లో ఉన్న వైరస్‌లు రూపాంతరం (మ్యుటేషన్ ) చెంది మనుషులపై విరుచుకుపడుతున్నాయి. ఇలా మూగజీవాల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులను జూనోటిక్ లేదా జూనోసెస్ అని పిలుస్తారు. ఈ జూనోసెస్ వ్యాధుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉన్నాయి. వాటిలో కొన్ని రకాల వైరస్‌లు సామర్థ్యం పెంచుకుని మహమ్మారులుగా మారుతున్నాయి. ఐపీబీఈఎస్ అధ్యయనం ప్రకారం.. 1940 నుంచి ఇప్పటివరకు కొత్తగా 330 అంటువ్యాధులను గుర్తించారు. వాటిలో 60 శాతానికి పైగా జంతువులు, పక్షుల నుంచే వచ్చాయని తెలిపిందిఇన్‌ఫ్లుయెంజా, సార్స్, కరోనా సహా చాలా వ్యాధులు కూడా జంతువులు, పక్షుల నుంచి వచ్చినవే. ఎబోలా, జికా, నిఫా వంటి వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లు కూడా వాటి నుంచి విస్తరించినవే..మరో వైపు కేరళలో కరోనా విజృంభణ కొనసాగుతున్నది. వరుసగా నాలుగో రోజు కూడా 20 వేలకుపైగా కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా యాక్టివ్ కేసులు 1.6 లక్షలకు పెరిగాయి. గత రెండు నెలలుగా ప్రతి రోజూ పది వేలకుపైగా పాజిటివ్ కేసులు, వందల సంఖ్యలో మరణాలు రికార్డవుతున్నాయి. కాగా, గురువారం నుంచి శుక్రవారం వరకు గత 24 గంటల్లో కొత్తగా 20,772 కరోనా కేసులు, 116 మరణాలు నమోదయ్యాయి. దీంతో ఆ రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 33,70,137కు, మొత్తం మరణాల సంఖ్య 16,701కు పెరిగింది. మరోవైపు గత 24 గంటల్లో 14,651 మంది కరోనా రోగులు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు కేరళ ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో కరోనా నుంచి కోలుకున్న వారి మొత్తం సంఖ్య 31,92,104కు చేరుకున్నదని, ప్రస్తుతం 1,60,824 యాక్టివ్ కరోనా కేసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, దేశంలో కరోనా హాట్‌స్పాట్‌గా కేరళ కొనసాగుతున్నది.

# వామ్మో..ఆగస్టు

విజయవాడ, జూలై 31, (న్యూస్ పల్స్)తెలుగు రాజకీయాలలో ఆగస్ట్ కి ఎంతో ప్రాధాన్యత ఉంది. రాజకీయాల్లో పెను సంక్షోభాలకు తెర తీసిన నెలగా దీన్ని చెప్పుకోవాలి. ముఖ్యంగా తెలుగు సినీ వల్లభుడు ఎన్టీఆర్ రెండు సార్లు ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవడానికి ఈ ఆగస్ట్ నెల చాలా చేసింది. 1984లో నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్ ని తొలి వెన్నుపోటు రుచి చూపిస్తే నాడు తన చాణక్యంతో ఆదుకున్న చంద్రబాబు 1995 ఆగస్ట్ లో అదే వ్యూహాలతో మామను పదవి నుంచి పడదోసి పీఠమెక్కారు. ఇక చాలా మంది కాంగ్రెస్ ముఖ్యమంత్రుల జీవితాల్లో కూడా ఆగస్ట్ భయాలు ఉన్నాయి. అంతే కాదు, చంద్రబాబు కూడా తన మొత్తం పాలనలో ఎక్కువగా బెదిరింది ఆగస్ట్ నెల గురించే.ఇక విషయానికి వస్తే జగన్ మీద అక్రమాస్తుల కేసులు ఉన్న సంగతి విదితమే. కేసులు పెట్టి పుష్కర కాలం అయింది. సీబీఐ కోర్టులో విచారణ సాగుతోంది. అయితే ప్రజా ప్రతినిధుల కేసులు త్వరగా పూర్తి చేయాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ విచారణ కూడా జోరందుకుంది. ఆగస్ట్ నెల నుంచి కీలకమైన పరిణామాలు ఈ కేసులో చోటు చేసుకోనున్నాయి అంటున్నారు. వీటి విచారణ కూడా వేగం పుంజుకుంటుందని చెబుతున్నారు. అంటే అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ముఖ్యమైన కేసుల తుది విచారణ చేపడతారు అంటున్నారు. జగన్ బెయిల్ రద్దు పిటీషన్ పై తీర్పు ఆగస్టు 25వ తేదీన వెల్లడి కానుంది.మరో వైపు రోజురోజుకూ రాజకీయాల్లో కూడా దుమారం రేగుతోంది. జగన్ కేంద్రం తో పోరాటం చేస్తున్నారు. మరో వైపు ఏపీలోని విపక్షాలు అన్నీ కూడా కట్టుగా జగన్ ని టార్గెట్ చేస్తున్నాయి. ఇంకో వైపు సొంత పార్టీలోనే అసంతృప్తి పెరిగిపోతోంది. వీటితో పాటు ఆర్థికపరమైన చిక్కులు కూడా ఏ నెలకు ఆ నెల పెరిగిపోతున్నాయి. దాంతో ఆగస్ట్ నెలలో ఇవన్నీ కూడి మరీ జగన్ సర్కార్ కి ఇబ్బందిని పెట్టే పరిస్థితి ఉంటుంది అంటున్నారు. మరో వైపు మూడు రాజధానుల మీద విచారణ కూడా ఇదే నెలలో జోరందుకుంటుంది అంటున్నారు. దాని ఫలితం ఎలా వస్తుందో అన్న టెన్షన్ కూడా జగన్ లో ఉందిట.మరో వైపు చూస్తే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం వద్దు అంటూ ఉద్యోగులు తొలిసారిగా పోరు బాట పట్టనున్నారు. అంటే జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల తొలి నిరసన అన్న మాట. ఇప్పటిదాకా తాము వేచి చూశామని కానీ సీపీఎస్ రద్దు విషయంలో ప్రభుత్వం కనీసంగా స్పందించడంలేదని వారు అంటున్నారు. దాంతో తాము ఉద్యమించక తప్పదని కూడా స్పష్టం చేస్తున్నారు. ఉద్యోగ వర్గాలు కనుక రోడ్డు మీదకు వస్తే ఆ ఒక్క డిమాండ్ తో ఆగదు అంటున్నారు. చాలా విషయాలే బయటకు వస్తాయని చెబుతున్నారు. మొత్తానికి జగన్ కి ఆగస్ట్ నెలలో ఇలాంటి గండాలు చాలానే ఉన్నాయని అంటున్నారు.

# సమీక్షలతో కాలం గడిపేస్తారా

విజయవాడ, జూలై 31, (న్యూస్ పల్స్)జగన్ లో ఆవేశం ఉంది. అదే ఆయన్ని ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టింది. జగన్ కోపాన్ని కూడా విజయానికి సోపానంగా మారుచుకున్నారు. ఆయన తన కాళ్ళు తనవి కాదనుకుని వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. ఎండకు ఎండి వానకు తడిసి మొత్తానికి జనాలకు చేరువ అయ్యారు. వారి ఆశీస్సులతో అధికారాన్ని అందుకున్నారు. రెండేళ్ళ పాలన ముగిసింది. జగన్ సమీక్షలకే పరిమితం అయ్యారు. ఏపీలో ఏం జరుగుతోంది అన్నది తెలియడంలేదు. లోకల్ బాడీ ఎన్నికలు అయినా మరేవైనా వైసీపీ గెలుస్తోంది. దానికి అధికారంలో ఉండడం కూడా అతి పెద్ద అడ్వాంటేజ్. అందువల్ల జనం గురించి తెలియాలి అంటే క్షేత్ర స్థాయిలోకి వెళ్ళాలి.జగన్ అయితే తాడేపల్లి నుంచి అసలు బయటకు రావడంలేదు. ప్రతీ రోజూ మాత్రం సమీక్షలు చేస్తున్నారు. అక్కడ అంతా బాగుంది అనే అంటారు. అయినా సరే జగన్ వాస్తవాలు తెలుసుకోమని అధికారులను పురమాయించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా జనాలకు చేరుతున్నాయా లేదా అన్నది చూడమని వారిని ఆదేశించారు. అయితే ఈ విషయంలో ఎక్కువ మంది అధికారులు అలసత్వమే చూపించారు. అంతే జగన్ లో అసహనం కట్టలు తెంచుకుంది. వారికి మెమోలు జారీ చేయమని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇది తనకు తాను ఇచ్చుకుంటున్న మెమోగా కూడా జగన్ చెప్పుకొచ్చారు.జగన్ కి అధికారులే కళ్ళూ చెవులు. వారినే ఆయన నమ్ముకున్నారు. ప్రభుత్వం అంటే వారే. కానీ వారితో పాటు ఎన్నికలైన 150 మంది ఎమ్మెల్యేలు మంత్రులు కూడా ఉన్నారు. వారిని విశ్వాసంలోకి తీసుకోకుండా బ్యూరోకాట్స్ కే బాధ్యతలు అప్పగించడం వల్ల తొలిసారి జగన్ దెబ్బ తిన్నాను అని గ్రహించారు. అందుకే ఆయన తన పనితీరు మీద కూడా మెమో అంటూ బాధపడుతున్నారు. నిజానికి ఏ వ్యవస్థకు ఆ వ్యవస్థ ఉంది. ఎవరి బాధ్యతలు వారికి ఉన్నాయి. ఎమ్మెల్యేలు జనం నుంచి వచ్చారు. వారికి అన్ని విషయాలు తెలుస్తాయి. వారి ద్వారా పథకాల అమలు జరిగితే అవినీతి జరుగుతుందని పక్కన పెట్టారు. మంత్రులకు విలువ ఇస్తే వారు ఏం చేస్తారో అని దూరం పాటించారు. ఇపుడు అధికారులు కూడా ఉదాశీనంగా ఉన్నారని ప్రభుత్వ పెద్ద మదనపడితే లాభమేంటి అన్న ప్రశ్న వస్తోంది.ఇకనైనా జగన్ మేలుకోవాలని అంటున్నారు. తన తీరు మార్చుకోవాలని కూడా పార్టీలోని వారే కోరుకుంటున్నారు. అధికారులకు రాజకీయాలతో సంబంధం లేదు. రేపటి రోజున ప్రభుత్వం మళ్లీ రావాలి అన్న తపన పార్టీ వారికే ఎక్కువగా ఉంటుంది. ఆ సంగతి గుర్తెరిగి జగన్ వారికి బాధ్యతలు అప్పగించాలి. అంతే కాదు, సమీక్షలో అంతా బాగుంది అన్న మాటలకు పడిపోయి మాయలో ఉండడం కంటే నిజాలు తెలుసుకుని పాలన చక్కదిద్దుకునేందుకు చొరవ చూపాలని కోరుతున్నారు. అధికారులకు మెమేలు ఒకసారి ఇస్తే సరే పదే పదే వారిని దోషులుగా చేస్తామంటే వారూ ఊరుకోరు. ఏది ఏమైనా అధికారులను నమ్ముకుని చెడిన రాజకీయ నాయకులు ఉన్నారు. జగన్ ఆ బాటన నడవకూడనే వైసీపీ వారు గట్టిగా కోరుకుంటున్నారు.

# తుంగభద్ర కష్టాలకు చెక్ ఎప్పుడు

కర్నూలు, జూలై 31, (న్యూస్ పల్స్)తుంగభద్ర జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనివిధంగా జులైలోనే వరదనీరు పోటెత్తింది. ఈసారి ముందస్తుగానే జిల్లాకు నీటిని విడుదల చేయడంతో అన్నదాతల్లో ఆనందం ఉప్పొంగుతోంది. అంతా సాగుకు సన్నద్ధమవుతున్నారు. కానీ మధ్య పెన్నార్ జలాశయం దక్షిణ కాలువ ఆయకట్టుదారుల్లో ఆ సంతోషం కనిపించడం లేదు. కాలువ ఆధునికీకరణ పనులు నత్తతో పోటీ పడుతుండటమే కారణం. చివరి ఆయకట్టుకు నీరు వెళ్లడం లేదన్న ఉద్దేశంతో ఎమ్పీఆర్ దక్షిణ కాలువ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఇదే జలాశయం ఉత్తర కాలువ పనులు ఏడాది క్రితమే పూర్తయ్యాయి. దక్షిణ కాలువ మాత్రం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. దీనికి ‘రాజకీయ’ గ్రహణం పట్టుకుంది. మొత్తం రూ.461.55 కోట్ల అంచనాలతో 86 కి.మీ. ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. 43, 44 ప్యాకేజీలుగా విభజించారు. 43వ ప్యాకేజీ కింద ఎమ్పీఆర్ 0 కి.మీ. నుంచి అనంత నగరం దాకా 41 కి.మీ, అనంత నుంచి నార్పల మండలం తుంపెర డీప్‌కట్ వరకు 42 నుంచి 86 కి.మీ.లు పనులు చేయాల్సి ఉంది. మొత్తం 86 కి.మీ. పరిధిలో 114 నిర్మాణాలు ఉండగా.. అందులో 12 మాత్రమే వివిధ దశల్లో ఉన్నాయి.ఎమ్పీఆర్ జలాశయానికి త్వరలో నీరు చేరనుంది. అక్కడి నుంచి కాలువకు విడుదల చేసినా.. ముందుకు వెళ్లే దారే లేదు. పాత అండర్ టర్నల్‌లను (యూటీ) తొలగించి.. కొత్తగా నిర్మాణం చేపట్టారు. అవి సగం కూడా పూర్తి కాలేదు. వీటిని పూర్తి చేస్తే తప్ప నీటి విడుదల సాధ్యం కాదు. తుంగభద్ర జలాలు ఎమ్పీఆర్‌కు వస్తున్నాయని ఆనందించాలో.. వచ్చినా తీసుకోలేని దుస్థితిలో ఉన్నామని బాధపడాలో రైతులకు అర్థం కాని పరిస్థితి. ముందస్తు హెచ్చెల్సీకి నీరు విడుదల కావడంతో రైతులు వరినార్లు పోసుకున్నారు. ఆగస్టులో కాలువకు నీరివ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.మధ్య పెన్నార్ జలాశయం (ఎమ్పీఆర్) దక్షిణ కాలువ ఇది. దీని ద్వారానే అటు తాడిపత్రి, ఇటు పులివెందుల ఉప కాలువలకు నీరు వెళతాయి. గార్లదిన్నె, అనంత గ్రామీణం, బీకే సముద్రం, శింగనమల, నార్పల మండలాల మీదుగా కాలువ 96.56 కి.మీ. పొడవున ఉంది. దీని పరిధిలో 36,052 ఎకరాల ఆయకట్టు, 29 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. మరోవైపు తుంపెర డీప్‌కట్ నుంచి తాడిపత్రి ఉప కాలువ మొదలవుతుంది. ఈ కాలువ పెద్దపప్పూరు, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 30.58 కి.మీ. ఉండగా.. 28,144 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇంతటి కీలకమైన దక్షిణ కాలువ ఆధునికీకరణపై ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. తుంగభద్ర జలాలు నాలుగైదు రోజుల్లో ఎమ్పీఆర్‌లోకి రానున్నాయి. ఇక్కడి నుంచి దక్షిణ కాలువకు నీరివ్వలేని దుస్థితి. కాలువ వెడల్పు.. కట్టడాల పనులు పూర్తి కాకపోవడమే అందుకు కారణం.దక్షిణ కాలువ కింద మొత్తం 36 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువ ద్వారానే తాడిపత్రి, పులివెందుల ఉప కాలువలకు నీరు వెళుతుంది. ప్రస్తుతం దక్షిణ కాలువ 1350 క్యూసెక్కుల సామర్థ్యం ఉంది. దీన్ని 2వేలకు పెంచాలన్న ఉద్దేశంతోనే ఆధునికీకరణ సాగుతోంది. పది మీటర్ల వెడల్పు ఉన్న కాలువను 15.6 మీటర్లకు పెంచనున్నారు. ఈ పని 70 శాతం పూర్తయినట్లు ఇంజినీర్లు ‘లెక్క’ నమోదు చేశారు. సైడ్ లైనింగ్ మాత్రం ఆగిపోయింది. లైనింగ్ వల్ల భూగర్భ జలాలపై ప్రభావం చూపిస్తుందన్న ఉద్దేశంతో గార్లదిన్నె మండల ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. గార్లదిన్నె, అనంత గ్రామీణ మండలాల పరిధిలో 23.4, 26.15 కి.మీ వద్ద ఉన్న పాత యూటీలను తొలగించారు. వీటి స్థానంలో కొత్త వాటిని నిర్మిస్తున్నారు. ఈ పనులు సగమే అయ్యాయి. ఇవి పూర్తయితేనే నీరు రావడానికి అవకాశం ఉంది. ఇక 17, 29.53 కి.మీ. వద్ద సింగిల్ లైన్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. ఇవన్నీ ఆగస్టు రెండో వారానికి పూర్తయ్యే పరిస్థితి లేదు. అందుకే అక్టోబరులో నీరిస్తామని హెచ్చెల్సీ అధికారులు ప్రకటించారు. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## మండిపడుతున్న ఉద్యోగులు...

విజయవాడ, జూలై 31, (న్యూస్ పల్స్)మొత్తానికి ఇన్నాళ్ళూ ఒడిసిపట్టిన అసంతృప్తి బద్దలైంది. ఏ జగన్ అయితే రావాలి. కావాలి అంటూ గట్టిగా కోరుకున్నారో ఆ ఉద్యోగులే ఇపుడు ఏపీ సర్కార్ అంటే మండిపోతున్నారు. ఏపీ ఎన్జీవో సంఘం అయితే డైరెక్ట్ అటాక్ చేసేసింది. జగన్ సర్కార్ లో ఉద్యోగులకు నెల జీతాలే కరవు అంటూ ప్రెసిడెంట్ బండి శ్రీనివాసరావు హాట్ కామెంట్స్ చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా జీతాలు సకాలంలో చెల్లించేలా చూడాలని తాను ఏడుకొండలవాడిని కోరుకుంటున్నట్లుగా ఆయన చెప్పడం ద్వారా సర్కార్ పరువు తీసేశారు.ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల ఫస్ట్ తారీఖు అంటే పండుగ లాంటిది అని ఆయన అంటున్నారు. అలాంటి పండుగను తమకు లేకుండా ఏపీ సర్కార్ చేసిందని కూడా ఆయన విమర్శించారు. నాలుగు నెలలుగా జీతాలు సకాలంలో రాక ఉద్యోగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని బండి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు అంటే ప్రభుత్వ ప్రతిష్ట మంటగలిసినట్లే అనుకోవాలిగా. ఇక పెన్షన్లు కూడా ఒక జిల్లాలో పడుతూంటే మరో జిల్లాలో లేవు అంటే ఏమనుకోవాలని ఆయన నిలదీస్తున్నారు. అంతే కాదు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ ఇప్పటికే 37 నెలలు ఆలస్యం అయిందని గుర్తు చేశారు. తెలంగాణలో ప్రకటించినట్టుగానే రాష్ట్రంలోనూ ప్రకటించాలన్ని, ఇక తాము ఈ విషయంలో ఆగే ప్రసక్తి లేదని కూడా ఆయన స్పష్టం చేయడం బట్టి చూస్తూంటే జగన్ సర్కార్ కి డెడ్ లైన్ విధంచారు అనుకోవాలిగా.మీరు ఏం చేసుకుంటారో మాకు తెలియదు, మాకు మాత్రం నెల జీతాలు సకాలంలో ఇవ్వాల్సిందే అంటూ గట్టిగానే చెప్పేశారు ఏపీ ఎన్జీవో నేత. అంతే కాదు, ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించేలా ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని కూడా ఆయన సలహా ఇవ్వడమే ఇక్కడ విశేషం. ఇవన్నీ చూస్తూంటే జగన్ సర్కార్ కి అసలైన కష్టాలు మొదలైనట్లుగానే భావించాలి. ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు వివిధ రకాలుగా మదన పడుతున్నప్పటికీ ఇంత స్ట్రాంగ్ గా మాత్రం ఎవరు బయటపడి మాట్లాడలేదు. ఇపుడు ఎన్జీవోలు బయట పడ్డారు, రేపు మిగిలిన వారు కూడా వస్తారు అంటున్నారు. ఒకవైపు తన హామీలను తీర్చేందుకు ఎక్కడ లేని డబ్బులను తెచ్చి గుమ్మరిస్తున్న జగన్ ప్రభుత్వం అనే రథానికి చక్రాలుగా ఉన్న ఉద్యోగుల విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తే ఎలా అన్న మాట సొంత పార్టీ నుంచి కూడా ఉంది. జగన్ ఈ విషయం లో ఇకనైనా మేలుకోకపోతే పంచుడు కార్యక్రమం వల్ల వచ్చే ఓట్ల సంగతేంటో కానీ ఉద్యోగులతో వైరం వల్ల కొరివితో తలగోక్కోవడమే అవుతుంది అంటున్నారు.

## హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ వేగ వంతం

**టీటీడీ ఈవో**

తిరుపతి జూలై 31, (న్యూస్ పల్స్) దేశీయ గోవుల ద్వారా సేకరించే పంచ గవ్యాలతో హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీని వేగ వంతం చేయాలని టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అధికారు లను ఆదేశించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో ఈవో ఎస్వీ గోశాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పంచగవ్యాలలో ధూపం, సబ్బులు, అగరబత్తీలు, పరిశుభ్ర తా సామగ్రి లాంటి ఉత్పత్తుల్లో వీలైనన్ని టిటిడి గోశాలలో త్వరిత గతిన తయారీకి చర్యలు తీసుకోవాలని ఎస్వీ గోశాల అధికారులను ఆదేశించారు. కోయంబత్తూర్లోని ఆశీర్వాద్ ఆయుర్వేద ఫార్మసీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు వివిధ పంచగవ్య ఆధారిత మూలికా ఉత్పత్తుల తయారీకి అర్హత కలిగి ఉన్నట్లు తెలిపారు.

## పలువురు టీడీపీ నేతలు ఆరెస్టు

విజయవాడ జూలై 31, (న్యూస్ పల్స్) కృష్ణాజిల్లా కొండపల్లిలో జరిగిన అక్రమ మైనింగ్ పరిశీలనకు సిద్ధమైన తెలుగుదేశం పార్టీ నిజ నిర్ధారణ కమిటీని పోలీసులు అడుగడుగున అడ్డుకున్నారు. నిజనిర్ధారణ కోసం వేసిన కమిటీ సభ్యులను హౌజ్ అరెస్ట్ చేశారు. అక్రమ మైనింగ్ జరుగుతోందనే ఫిర్యాదులపై కమిటీ శనివారం క్షేత్రస్థాయి పర్యటనకు సిద్దమయింది. దీంతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. .కొండూరు మండలంలో రహదారులపై భారీగా పోలిసులు మోహరించారు. జి.కొండూరు లో ప్రధాన రహదారులలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గత రాత్రి నుంచి పలువురు పార్టీ నేతలను గృహనిర్బంధం చేశారు. గుంటూరులో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, విజయవాడలో నాగుల్ మీరా, వర్ల రామయ్య, బొండా ఉమ, మచిలీపట్నంలో మాజీ ఎంపీ కొనకళ్ల, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జగ్గయ్యపేటలో నెట్టెం రఘురామ్, నందిగామలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలను పోలీసులు గృహనిర్బంధం చేశారు.

## ఏసీబీ వలలో పంచాయితీ కార్యదర్శి కృష్ణ మాధురి

నెల్లూరు జూలై 31, (న్యూస్ పల్స్)ఏఎస్ పేట మండలం కావలి ఎడవల్లి పంచాయితీ కార్యదర్శి కృష్ణ మాధురి ఏసీబీ దాడిలో దొరికిపోయారు. నాలుగు వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కార్యదర్శి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన జిల్లా తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు ఎం రమణయ్య పంచాయితీలో గత ఏడాది చేసిన వీధిలైట్ల బిల్లులు రూ 13500 డ్రా చేసి ఇచ్చేందుకు కార్యదర్శి 6000 లంచం డిమాండ్ చేశారు.

# పీకల్లోతు కష్టాల్లో ఏపీ ఆర్థిక పరిస్థితి

విజయవాడ, జూలై 31, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిగతులపై కేంద్ర ప్రభుత్వం పక్కాగా ఆరా తీస్తోంది. ఇప్పటికే అన్ని రకాల పరిమితులు అధిగమించి, కొత్త అప్పులకోసం ఏపీ ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్రం పగ్గాలు బిగించేందుకు సిద్దమవుతోంది. గడచిన రెండు మూడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి ఈ మేరకు సంకేతాలు అందుతున్నాయి. ప్రభుత్వం పంపిన అన్ని రకాల ఆర్థిక ప్రతిపాదనలు, అభ్యర్థనలను పక్కన పెడుతోంది. ఇతర విన్నపాలకు సంబంధించి కూడా వేగం తగ్గించింది. కేంద్రం సొంత ప్రయోజనాలకు సంబంధించి మాత్రం సత్వరం చర్యలు తీసుకుంటోంది. తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్రం కేంద్రం గుప్పిట్లోకి వెళ్లిపోయినట్లేనని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అక్టోబర్ నెల నుంచి వచ్చే మార్చి వరకూ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో కేంద్రం నియంత్రణ పెరుగుతుందంటున్నారు. రుణాలను పూర్తిగా నియంత్రించే దిశలో చర్యలకు ఆర్థిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. దీనివల్ల వైసీపీ ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, సంక్షేమ పథకాలపై పెను ప్రభావం పడే సూచనలు కనిపిస్తున్నాయి.రాజకీయంగా వైసీపీతో పోటీ పడలేకపోతున్న తెలుగుదేశం పార్టీ ఆర్థిక అస్త్రాలతోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై టీడీపీ ప్రశ్నలు గుప్పిస్తోంది. అదుపు తప్పిన వ్యయంపై కేంద్రం నియంత్రణ చర్యలు తీసుకుంటుందో, లేదో చెప్పాలంటూ నిలదీస్తోంది. ఒక రకంగా కేంద్రాన్ని ఏపీపై ఎగదోసేందుకు తెలుగుదేశం ఏర్పాట్లు చేసుకుంటోంది. వైసీపీ దీనిని కౌంటర్ చేయలేని నిస్సహాయ స్థితి లో కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉండే రాజకీయం హస్తినలో ప్రదర్శితమవుతోంది. టీడీపీ, వైసీపీల రాజకీయ వైరం కేంద్రానికి కలిసి వస్తోంది. ఇప్పటికే ఏపీపై బీజేపీ పెద్దలు ఒక కన్నేసి ఉంచారు. కాగల కార్యం గంధర్వులే తీరుస్తారన్నట్టు తెలుగుదేశం అన్నిటికీ రెడీ అవుతోంది. కేంద్రం చేతికి కావాల్సినంత రాజకీయ ముడి సరుకు అందిస్తోంది. సాంకేతికంగా ఉన్న అవకాశాలను కేంద్రం కూడా వినియోగించుకుంటే ఆంధ్రప్రదేశ్ ఆర్తిక దిగ్బంధనంలో చిక్కుకోక తప్పదు.కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా తీసుకునే చర్యలకంటే పరోక్ష సంకేతాలు ప్రమాదకరమైనవి. సాధారణ పరిస్థితుల్లో ద్రవ్య నిర్వహణ చట్టం అనుమతించిన పరిమితుల కంటే 24 వేల కోట్ల కు పైగా ఏపీ వినియోగించుకుంది. మామూలుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూడు శాతం అంటే 30 వేల కోట్ల రూపాయల వరకూ ఏటా అప్పులు తెచ్చుకోవచ్చు. కానీ అది 54 వేల కోట్ల రూపాయలై కూర్చుంది. ఇది 2020-21 ఆర్థిక సంవత్సరం నాటి లెక్క. అందులో 20 వేల కోట్ల రూపాయల వరకూ కరోనా వెసులుబాటుగా రెండు శాతం అదనపు రుణానికి కేంద్రం అనుమతించింది. ఆ పరిమితిని కూడా ఏపీలోని వైసీపీ ప్రభుత్వం అధిగమించేసింది. ఇవి కాకుండా కార్పొరేషన్ల రూపంలో చేసిన అప్పులు అదనం. రాజ్యసభలో వివరాలను టీడీపీ అడిగి రాబట్టింది. ఆయా వివరాలన్ని బహిర్గతం చేస్తూ కేంద్రం కొన్ని వ్యాఖ్యలు కూడా చేసింది. అన్నిరకాల పరిమితులను ఆంధ్రప్రదేశ్ అధిగమించిందనేది కేంద్రం చేసిన వ్యాఖ్యల సారాంశం. వీటి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ లో రుణానికి చేసే ప్రయత్నాలకు గండి పడవచ్చు. ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ పరపతికి దెబ్బతగిలి ఆర్థిక సంస్తలనుంచి సాయం అందకపోతే ఎదురీత తప్పదు.పార్లమెంటు సమావేశాలకు ముందుగా రాష్ట్ర ఎంపీలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఆర్థిక స్థితిగతులపై సమావేశంలో చర్చ జరిగింది. కేంద్రం పై ఒత్తిడి పెంచి పథకాల రూపంలో అయినా నిధులు వచ్చేలా చేయాలని స్పష్టంగానే ముఖ్యమంత్రి ఆదేశించారు. పోలవరం బకాయిలు , కేంద్రం నుంచి ముందస్తుగా ఈ క్వార్టర్ కు రావాల్సిన నిధులు వచ్చేలా చూడాలని సీఎం సూచించారు. అయితే అదంత సులభంగా కనిపించడం లేదని వైసీపీ ఎంపీలు వాపోతున్నారు. అన్ని రాష్ట్రాలతో పాటే ఆంధ్రప్రదేశ్ కూడా అని కేంద్రం చెప్పేస్తోంది.

# స్కూళ్లలో ఇంటర్మీడియట్

కడప, జూలై 31, (న్యూస్ పల్స్)పదో తరగతి చదివిన చోటే ఇంటర్మీడియెట్‌ను పూర్తి చేసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత తమ పిల్లలను ఏ కళాశాలలో చేర్పించాలన్నది తల్లిదండ్రులకు పెద్ద సమస్య. 'ప్రభుత్వ కాలేజీలో సీటు వస్తుందా.. వచ్చినా ఎంత దూరం వెళ్లి చదువుకోవాలి.. ఒత్తిడి విద్య, ఫీజుల భారం' లాంటి కారణాలతో చదువును ఆపేసి.. ఇంటికే పరిమితమైపోవడం వంటి వాటకి చెక్ పడనుంది.గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్ కోసం మండలాలు దాటాల్సిన అవసరం లేదు. మండల కేంద్రంలోని హైస్కూల్లోనే ఇంటర్మీడియెట్ విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయమై ఇటీవల విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులతో సమావేశాన్ని కూడా నిర్వహించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు చాలా మంది ఇంటర్మీడియెట్ చదివేందుకు ఎందుకు ఉత్సాహం చూపడం లేదనే అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. కాలేజీ దూరాభారం వల్లే సమస్య తలెత్తుతోందని దాదాపు అందరూ అంగీకరించినట్లు తెలిసింది. పదో తరగతి తర్వాత ముఖ్యంగా ఎక్కువ మంది బాలికలు విద్యకు దూరమై డ్రాపౌట్స్‌గా మారుతున్నట్లు గుర్తించారు. దీంతోపాటు పేద, మధ్య తరగతి విద్యార్థులు కూడా పై చదువులు చదివేందుకు ఆర్థిక స్థోమత లేక విద్యకు దూరమౌతున్నారు. ఇక హైస్కూల్స్‌లో ఇంటర్ విద్యను ప్రవేశ పెడితే బాలికల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుంది. అలాగే గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతికి చెందిన వారు విద్యావంతులుగా మారే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా 32 హైస్కూల్స్‌ను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయనున్నారు. వీటిలో చదివే వారంతా ఇక ఇంటర్ విద్యను కొనసాగించనున్నారు.జిల్లాలో 50 మండలాలు ఉన్నాయి. ఇందులో 27 ప్రభుత్వ, 20 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటితోపాటు 10 మోడల్ స్కూల్స్, 10 సోసియల్ వేల్ఫేర్, 10 కేజీబీవీలల్లో జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అలాగే ఈ ఏడాది నుంచి మరో 19 కే జీబీవీల్లో ఇంటర్ విద్యను అప్‌గ్రేడ్ చేశారు. ఈ ఏడాది నుంచి కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఒక్కో సెక్షన్‌లో 40 మంది విద్యార్థులకు మాత్రవే అనుమతి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇంటర్ తరగతులు బోధించడం వల్ల గ్రామీణ ప్రాంతానికి చెందిన అనేక మంది విద్యార్థులు చదివే అవకాశం ఉంది. జిల్లాలోని బి కోడూరు, బ్రహ్మంగారిమఠం, చక్రాయపేట, చాపాడు, చెన్నూరు, చిన్నమండెం, చిట్వేలి, దువ్వూరు, గాలివీడు, కమలాపురం, కాశినాయన, ఖాజీపేట, కొండాపురం, లింగాలలో జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అలాగే ముద్దనూరులో రెండు, మైలవరం, నందలూరు, ఓబులవారిపల్లె, పెద్దముడియం, పెనగలూరు, పెండ్లిమర్రి, రాజుపాళెం, సిద్దవటం, సింహాద్రిపురంలో రెండు, తొండూరులో రెండు, వల్లూరు, వీరపునాయునిల్లె, వేంపల్లిలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

# గిట్టుబాటు రాని సమయంలో మార్కెటింగ్ శాఖ కొనుగోళ్లు



గుంటూరు, జూలై 31, (న్యూస్ పల్స్) కేజీ నిమ్మకాయల ధర రూ.2కు పడిపోయింది. రైతుకు కనీసం కోత ఖర్చులు కూడా రాని దుస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తక్షణమే మార్కెటింగ్ శాఖను రంగంలోకి దించారు. కొనుగోళ్లలో జోక్యం చేసుకుని రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మార్కెటింగ్ శాఖ నిమ్మకాయల కొనుగోలు చేపట్టింది. దీంతో కిలో రూ.2 ఉన్న నిమ్మ ధర ఇప్పుడు రూ.40కి పెరిగింది. దీంతో నిమ్మ రైతులకు మేలు కలుగుతోంది. నిమ్మ మార్కెట్‌లో తాజా పరిస్థితి ఎలా ఉందనే దానిపై సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్నతో సీఎం వైఎస్ జగన్ సోమవారం సమీక్షించారు. మార్కెట్లలో తాజా పరిస్థితులు, నిమ్మ ధరలు ఎంతవరకు పెరిగాయి, పొరుగు రాష్ట్రాల్లో మార్కెట్ల స్థితిగతులేమిటనే అంశాలపై సీఎం ఆరా తీశారు. పొరుగు రాష్ట్రాల్లో మార్కెట్లు మూతపడటంతో నిమ్మ ఎగుమతులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఒక్కసారిగా నిమ్మకాయల ధరలు పడిపోయాయి. ఏపీలోని ప్రధాన మార్కెటైన ఏలూరులో ఈ నెల 24న కేజీ ధర రూ.2కు పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.నిమ్మ మార్కెట్లలో జో క్యం చేసుకున్న అధికారులు ప్రభుత్వం తరపున కొనుగోళ్లు జరిపారు. మార్కెటింగ్ కమిషనర్ పీఎస్ ప్రద్యు మ్న బెంగాల్ వంటి తూర్పు రాష్ట్రాల అధికారులతో మాట్లాడి అక్కడి మార్కెట్లు తెరుచుకునేలా చూశారు. అక్కడి మార్కెట్లకు ఎగుమతులు మొదలు కావడంతో నిమ్మ ధరలు తిరిగి పుంజుకున్నాయి. గత శుక్రవారం ఏలూరు మార్కెట్‌లో కిలో నిమ్మకాయల ధర కనిష్టం రూ.2 నుంచి గరిష్టంగా రూ.5 వరకు పలకగా.. మార్కెటింగ్ శాఖ జోక్యంతో ఏలూరుతో పాటు, దెందులూరు మార్కెట్‌లో శనివారం కిలో ధర గరిష్టంగా రూ.9 పలికింది. ఏలూరు మార్కెట్‌లో సోమవారం కిలో కాయలను రూ.40 వరకు కొనుగోలు చేశారు. దెందులూరు మార్కెట్‌లోనూ కిలో రూ.30, ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న గూడూరు మార్కెట్‌లో రూ.11.50 వరకు కొనుగోలు చేశారు.సీఎం జగన్ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు గత శనివారం నుంచే నిమ్మ మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలు పెట్టారు. కేజీ కాయల కనీస ధర రూ.9గా నిర్ణయించిన మార్కెటింగ్ శాఖ అధికారులు ఏలూరు మార్కెట్‌లో కొనుగోళు చేపట్టడంతో ధరల్లో భారీ పెరుగుదల కొనసాగుతోంది. 2.1 టన్నుల నిమ్మకాయలను మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసింది. ఇందుకోసం ధరల స్థిరీకరణ నిధి నుంచి సొమ్మును వెచ్చించింది. పంటలకు కనీస గిట్టుబాటు ధర లేనప్పుడు రైతులను ఆదుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసింది. ధరలు పతనమైనప్పుడల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రంగంలోకి దిగి మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ప్రైస్ స్కీమ్ (ఎంఐఎస్) కింద మార్కెట్ల లో ప్రభుత్వం తరపున జోక్యం చేసు కుని ధరల స్థిరీకరణ నిధిని వినియోగించి కొనుగోళ్లు జరుపుతున్నారు. తాజాగా అదే విధానంలో పెద్ద ఎత్తున నిమ్మకాయల్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం.. ఆ రైతులకు కొండంత అండగా నిలబడింది. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేశారు. ఏ పంటకైనా కనీస గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులను రంగంలోకి దించి ఆ పంటలను మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేయిస్తున్నారు. అరటి, బత్తాయి, ఉల్లి, టమాటాలు ప్రభుత్వమే కొనుగోలు చేయటం వల్ల పోటీతత్వం పెరిగి రైతులకు కనీన గిట్టుబాటు ధర లభించింది.

# బాబు టూర్లలలో అల్లుడి పేరు

తిరుపతి, జూలై 31, (న్యూస్ పల్స్)కరోనా తగ్గుముఖం పట్టడంతో ఏపీ లో విపక్ష నేత చంద్రబాబు దూకుడు పెంచారు. అధికారపక్షానికి వ్యతిరేకంగా పోరాటాలు, పరామర్శలు ఇలా ఆయన ఎదో ఒక కార్యక్రమంలో ఉంటున్నారు. జూమ్ బాబు గా ఇన్నాళ్ళు వైసిపి నేతలు చేసిన చేస్తున్న విమర్శలకు తన టూర్స్ తో చెక్ పెట్టాలన్న పట్టుదల సైకిల్ పార్టీ అధినేత. ఇదంతా బాగానే ఉంది. ఆయన ఎక్కడికి వెళ్ళినా చంద్రబాబుకు ఇష్టం లేని స్లోగన్ ఒకటి ప్రతీ చోటా చర్చనీయంగా మారింది.తెలుగుదేశం పార్టీ గతంలో ఎన్నడూ లేనంత డీలా పడివుంది. జగన్ పార్టీ గత ఎన్నికల నుంచి స్థానిక ఎన్నికల వరకు కొట్టిన దెబ్బలతో ఐసీయూ లో చేరినట్లు మూలన పడింది ఆ పార్టీ. అయితే రాజకీయాల్లో ఇవన్నీ సహజమే. జీరో నుంచి తిరిగి అధికారం దిశగా ఎదిగిన పార్టీలు చరిత్రలో కనిపిస్తూ ఉంటాయి. ఆ విశ్వాసం తోనే చంద్రబాబు కాలికి బలపం కట్టుకుని పార్టీ కి పూర్వ వైభవానికి శ్రీకారం గట్టిగానే చుట్టారు. కానీ కొన్ని ప్రాంతాల్లో ఆయన పర్యటనలకు జూనియర్ ఎన్టీఆర్ రావాలి పార్టీని కాపాడాలి అంటూ కొందరు చేస్తున్న అల్లరి తలపోటుగా పార్టీకి మారింది. వారి నినాదాల వల్ల ప్రస్తుతం నష్టం ఏమి లేకపోయినా ప్రజల్లో మాత్రం పసుపు పార్టీలో చంద్రబాబు పనైపోయిందనే సంకేతాలు వెళ్ళడం, చర్చ జరగడం ప్రత్యర్థుల లక్ష్యంగా కనిపిస్తుందితెలుగుదేశం పార్టీ భావి వారసుడు నారా లోకేష్. ఇందులో పార్టీ శ్రేణుల్లో ఏమాత్రం అస్పష్టత లేదు. అయితే స్వయానా లోకేష్ మంగళగిరి లో ఓటమి చెందడంతో ఆయన నాయకత్వంపై పార్టీ క్యాడర్ లో పూర్తి స్థాయి విశ్వాసం లేకుండా పోయింది. స్వయంగా అచ్చెన్నాయుడే ఒక వీడియో లో లోకేష్ సరిగ్గా ఉంటే పార్టీకి గతి ఇలా ఎందుకు ఉంటుంది అంటూ వ్యాఖ్యలు చేసినప్పుడు చంద్రబాబు తరువాత వారసులు ఎవరన్న చర్చ తెలుగు రాష్ట్రాల్లో జోరుగా నడిచింది. కట్ చేస్తే తిరుపతి ఎన్నికల తరువాత కరోనా సెకండ్ వేవ్ టిడిపి ఆన్లైన్ యాక్టివిటీ కే పరిమితం కావడం ఇప్పుడు కేసులు తగ్గాకా చంద్రబాబు స్పీడ్ కావడంతో ఇప్పుడిప్పుడే పార్టీ గాడిన పడుతుంది అనుకున్న సమయంలో జూనియర్ గోల టిడిపి అధినాయకత్వం చెవిలో జోరీగలా మారింది.వాస్తవానికి చంద్రబాబు తరువాత ఆయన స్థానం భర్తీ చేసే వారు టిడిపి లో కనుచూపు మేరలో కానరావడం లేదు. 2009 లో జూనియర్ ఎన్టీఆర్ సుడిగాలి పర్యటనలు చేసినా ఏమాత్రం ఫలితం కానరాలేదు. అలాంటిది ఇప్పుడు ఆయన పార్టీకి నేతృత్వం వహించినా జగన్ చరిష్మా ను ఎదుర్కోవడం చిన్న విషయం కాదు. అటు ప్రత్యక్ష ఎన్నికల్లో ఫెయిల్ కావడంతో లోకేష్ గత ట్రాక్ రికార్డ్ పరంగా చూసుకుంటే జూనియర్ ఎన్టీఆర్ లు తెలుగుదేశానికి పూర్వవైభవం తెచ్చే దమ్మున్నవారు కారన్నది ఆ పార్టీలోనే ఒక అపనమ్మకం. మరి చంద్రబాబు ను పక్కన పెడితే తెలుగుదేశం నావకు చుక్కాని ఎప్పుడు లభిస్తారో చూడాలి.

# చేతికి ఎముక లేకుండా చెల్లింపులే

గుంటూరు, జూలై 31, (న్యూస్ పల్స్)ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలపైనే ప్రజలకు, వ్యాపారులకు, వాణిజ్య వేత్తలకు నమ్మకం ఉంటుంది. ఈ విషయం ఎక్కడా తేడా లేదు. కొన్ని కొన్ని బడా వ్యాపార సంస్థలకు కూడా ప్రభుత్వాలే భరోసా ఇచ్చి.. హామీ ఇచ్చి.. ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చుకునేలా ఏర్పాట్లు చేస్తాయి. ఇక, తమ పరిధిలో వాటికి కూడా ఆయా ప్రభుత్వాలు అండగా ఉన్న పరిస్థితి ఉంది. అంటే.. ఇదంతా కూడా ప్రభుత్వాలపై నమ్మకంతోనే జరుగుతుంది. ప్రభుత్వాలు మారినా.. ఈ 'నమ్మకం' మాత్రం సడలకుండా ఉంటుంది. 'గవర్నమెంట్ గ్యారెంటీ ఉంటే.. ఇంకేంటి' అనే మాట సర్వత్రా వినిపిస్తూనే ఉంటుంది. అయితే.. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం విషయంలో ఇది 'రివర్స్' అయిందని అంటున్నారు.ఏపీలోని జగన్ ప్రభుత్వం ఇప్పుడు దేశంలోనే పెద్ద చర్చనీయాంశంగా మారిపోయింది. అప్పులు లెక్కకు మించి తేవడంతో రాష్ట్రం ఇప్పుడు అప్పుల కుప్పగా మారిపోయింది. కేవలం సంక్షేమం కోసంపాకులాడుతున్న ప్రభుత్వం ఖజానా కొల్లబోతున్న విధానాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో చాలా పథకాలు.. నిలిచిపోతున్నాయి. మరీముఖ్యంగా ప్రభుత్వ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు నిధులు చెల్లించలేక.. విలవిల్లాడుతున్నారు. ఇప్పటికీ కొన్ని పనుల్లో గత ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు జగన్ సర్కారు నిధులు చెల్లించలేదు. పోనీ.. దీనికి రాజకీయ కారణాలు ఉన్నాయని అనుకున్నా.. తాజాగా ప్రభుత్వం చేపట్టిన పనులకు కూడా కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించడం లేదు. జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రెండేళ్లలో చేసిన కోట్లాది రూపాయల పనులకు సంబంధించిన బిల్లులకే దిక్కూ దివాణం లేకుండా పోయింది.దీంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.ప్రభుత్వ పనులను చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రోడ్లను బాగు చేసేందుకు జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లను పిలిచేందుకు సన్నద్ధమైంది. అయితే ఎవరూ కూడా ముందుకు రాలేదని అధికారులే చెబుతున్నారు. ఈ క్రమంలో అసలు విషయం తెలుసుకున్న రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు.. కాంట్రాక్టర్లను బతిమాలినంత పనిచేశారు. బ్యాంకుల ద్వారా.. మీకు నిధులు ఇప్పిస్తామంటూ.. ఆయన వారిని బుజ్జగించే పనిచేపట్టారు. అంటే.. ప్రభుత్వం తరపున పనిచేసిన కాంట్రాక్టర్లకు.. నేరుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించే పద్ధతిని పక్కన పెట్టి బ్యాంకుల ద్వారా చెల్లింపులు చేస్తామని అన్నారు. నిజానికి ఈ విధానం.. ఏపీ చరిత్రలో ఇదే తొలిసారి. దీనిలో పారదర్శకత ఉంటుంది.. అందుకే ప్రభుత్వం ఇలా చేస్తోందేమో.. అనుకుంటున్నారేమో.. అదేం కాదు.ప్రభుత్వం దగ్గర నిధులు లేకపోవడంతో కాంట్రాక్టులకు నిధులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో వీరికి ఇప్పుడు బ్యాంకుల ద్వారా హామీలు ఇప్పించి.. పనులు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే.. కృష్ణబాబు.. ఈ వ్యవహారంపై పెద్దగా దృష్టి పెట్టారు. కాంట్రాక్టర్లను బుజ్జగించే పనిచేపట్టారు. అయితే..దీనిపై సీనియర్ అధికారుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం దివాలా తీసిందా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఇది జగన్ సర్కారుకు ప్రాణసంకటమనేని అంటున్నారు పరిశీలకులు.

# విశాఖలో ఖతర్నాక్ దొంగల ముఠా

విశాఖపట్టణం, జూలై 31, (న్యూస్ పల్స్)వైజాగ్‌లో ఖతర్నాక్ దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో చోరీకి ఈ ముఠా ప్లాన్ వేసింది. అక్కడ తేడా కొట్టడంతో తప్పించుకుని కారులో వైజాగ్‌కు పారిపోయారు. దీంతో రాజాం పోలీసులు చేజింగ్ చేశారు. ఇటు వైజాగ్ పోలీసులను అలర్ట్ చేయడంతో చాకచక్యంగా వారిని విశాఖ పోలీసులు పట్టుకున్నారు. బంగారం దుకాణాలనే ఈ ముఠా టార్గెట్ చేస్తోంది. ఈనెల 27న శ్రీకాకుళం జిల్లా రాజాంలో చోరీకి పాల్పడింది. తిరిగి వచ్చి బంగారం ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి ముఠాలోని ముగ్గురు అక్కడ పట్టుబడ్డారు. మరో ముగ్గురు కారులో పారిపోయారు. విశాఖ వైపు వారు పారిపోతున్నారని తెలుసుకుని?అక్కడి పోలీసులకు రాజాం పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో సినీ స్టైల్లో కారును ట్రాక్ చేసి దొంగల ముఠాను పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వీరు.. షాపులకు వెళ్లి రోల్డ్ గోల్డ్ పెట్టి అసలు బంగారు నగలను ఎత్తుకెళుతున్నారని పోలీసులు కనిపెట్టారు.ఆ ఇద్దరిని ఎవరు హత్య చేశారు..? ఇంట్లోనే మర్డర్ చేశారా..? హత్య ఎక్కడో చేసి ఇంట్లో పెట్టారా..? అసలు ఎందుకు హత్యలు చేశారు..? ఆస్తి గొడవలా..లేక ఇంకైదైనా కారణాలా.. అసలేం జరిగింది..? గుంటూరు జిల్లా తాడేపల్లి జరిగిన డబుల్ మర్డర్స్ .. లోకల్‌గా హాట్ టాపిక్ అయ్యింది. మీరు చూస్తున్న ఈ విజువల్స్ తాడేపల్లిలోని ఓ ఇంట్లో లభ్యమయ్యాయి ఇద్దరి డెడ్ బాడీలు.. కుళ్లిపోయి ఉన్నాయి. ఎలా చనిపోయారు.. ఎందుకు చనిపోయారు..? హత్యలు చేసి ఇక్కడ పడేశారా.. ఆత్మహత్యలు చేసుకున్నారా..? ఇంటికి తాళం వేసి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై దర్యాప్తు చేపట్టారు పోలీసులు.ఇంట్లో నుండి దుర్వాసన రావడంతో.. పోలీసులకు సమాచారం ఇచ్చామంటున్నారు స్థానికులు. మృతులు 12 ఏళ్లుగా తాడేపల్లిలో ఉంటున్నారన్నారు. వీళ్లతో ఎవరికీ పెద్దగా పరిచయాలు లేవుంటున్నారు. మరి ఈలాంటప్పుడు ఈ హత్యలు ఎలా జరిగాయి..? మూఢ నమ్మకాలతో ఏదైనా జరిగిందా ..? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. డెడ్ బాడీలకు పోస్టుమార్టం చేసి.. దహనసంస్కారాలు చేశారు.

# ఏమార్చి దొంగతనం చేస్తారు...

శ్రీకాకుళం, జూలై 31, (న్యూస్ పల్స్)మగవారి తో ఆడవారు అన్నింటా సమానమే అంటున్నారు. మంచితనం, మానవత్వం లోనే కాదు.. భర్తలు చంపుతున్న భార్యలు, కన్న ప్రేమను మరచి పిల్లల్ని చంపుతున్న తల్లులు, వెరైటీ దొంగతనాలు అన్నిటిలోనూ ఆధునిక మహిళ నేటి సమాజంలో తాము ఏమీ తక్కువ కాదు అని నిరూపిస్తున్నారు. తాజాగా ఓ దొంగ మహిళా దొంగల ముఠా జ్యూయలరీ షాప్ లో భారీ చోరీ కి ప్లాన్ చేసి అడ్డంగా దొరికిపోయిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..శ్రీకాకుళం జిల్లా రాజాంలో మహిళా దొంగల ముఠా హల్ చల్ చేసింది. ఈనెల 27 న సాయికిరణ్ జ్యూయలరీలో చోరీ చేసిన ఈ దొంగల ముఠా.. మళ్ళీ మరోసారి చోరీ కి ప్లాన్ చేశారు. అయితే అప్పటికే తన షాప్ లో దొంగతనం జరిగిందని జ్యూయలరీ షాప్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మహిళా దొంగల ముఠాను పట్టుకోవడానికి ప్లాన్ చేశారు. దొంగలను సినీ స్టైల్ లో వెంబడించి రాజాం పోలీసులు ముగ్గురిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. దీంతో వారిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.పారిపోయిన ముగ్గురు కారులో విశాఖ వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. విశాఖ పోలీసులకు రాజాం పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో విశాఖ పోలీసులు సినీస్టైల్లో కారుతో సహాదొంగలను ట్రాక్ చేశారు. వారిని రాజాం పోలీసులకు అప్పగించారు. గత కొన్ని రోజులుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో జ్యూయలరీ షాపులను టార్గెట్ చేసిన దొంగ ముఠా చోరీలు చేస్తుంది. ఈ ముఠా బంగారం షాపు లో రోల్డ్ గోల్డ్ బంగారం పెట్టి.. అసలు బంగారం ఎత్తుకెళ్తుంది. ఈ మహిళా దొంగల ముఠా ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వారీగా గుర్తించారు.

# కూర్మన్నపాలేంలో అక్రమ నిర్మాణం కూల్చివేత

అడ్డుకున్న బిల్డర్, గ్రామస్థులు?ఉద్రిక్తత

కూర్మన్నపాలెం రాసాలమ్మ కాలనీలో మూడంతస్తుల అక్రమ నిర్మాణం భవనాన్ని కూల్చటానికి టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చారు. వారిని బిల్డింగ్ యజమాని, గ్రామస్తులు అబ్బుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు గ్రామస్తుల మధ్య వివాదం చెలరేగింది. దాంతో పోలీసులు భారీగా మోహరించారు. బిల్డింగ్ యజమాని గింజుపల్లి శంకర్రావు మాట్లాడుతూ కూర్మన్నపాలేం రాసాలమ్మ కాలనిలో జీ+ 2 భవనాన్ని నిర్మించాం. కొద్దరోజుల క్రితం 86 వ వార్డు కార్పోరేటర్ లేళ్ళ కోటేశ్వర్రావు ఇంటికి పిలిపించి మీ ఇంటి నిర్మాణం కొరకు కాంట్రాక్టర్ వైసిపి నాయకుడికి ఇచ్చావు కనుక వెంటనే అతనికి సెటిల్ చేసి పంపమని చెప్పటంతో అది కుదరధని చెప్పానని అన్నారు. టౌన్ ప్లానింగ్ అదికారులు అప్రవల్ లేకుండా నిర్మాణం చేయటంతో బిల్డంగ్ పై స్లాబును తొలగించారని అన్నారు. దామా సుబ్బారావు మాట్లాడుతూ కేవలం వైకాపా చెందిన కాంట్రాక్టర్ కు బిల్డింగ్ కట్టడానికి ఇవ్వటంతో అధికారులను పంపించి కూల్చివేసారని అన్నారు.

# దేవినేని కుటుంబాన్ని పరామర్శించిన చంద్రబాబు

విజయవాడ జూలై 31, (న్యూస్ పల్స్)మాజీ మంత్రి దేవినేని ఉమ కుటుంబ సభ్యులను టీడీపీ అధినేత చంద్రబాబు పరామర్శించారు. విజయవాడ శివారులోని గొల్లపూడిలో దేవినేని ఇంటికి వచ్చిన చంద్రబాబు, ఉమ భార్య పిల్లలతో మాట్లాడారు. కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ లో అక్రమ మైనింగ్ జరుగుతోందని, నిజనిర్ధారణకు వెళ్లి మాజీ మంత్రి ఉమ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి ధైర్యం అందించేందుకు తాను వచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. దేవినేని ఉమ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, భయపడాల్సిన పని లేదని బాబు ధైర్యం చెప్పారు.

# ఆస్థి పన్ను విధానం సరికాదు

విశాఖపట్నం జూలై 31, (న్యూస్ పల్స్)విశాఖలో ఆస్తి పన్ను విధింపుపై ప్రభు త్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతి రేకిస్తున్నామని సీపీఎం కార్పొరేటర్ గంగారాం తెలిపారు.ప్రజల అభ్యం తరాలపై కార్పొరేటర్ల కు జీవీఎంసీ వివరణ ఇవ్వాలని,ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని చాలా వరకు వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు.ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు పన్నులు వేస్తే కౌన్సిల్ ఎందుకు,కార్పొరేటర్లు ఎందుకని ప్రశ్నించారు.ఆస్తి పన్ను పై ప్రతిపక్ష పార్టీలు అన్ని కలిసి రావాలని,దేశం లో ఏ రాష్ట్రంలో ఇంత దారుణమైన ఆస్తి పన్ను పెంపు లేదని,తక్షణమే దీని మీద ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

# కుక్కలపై దాడులా...

ఏలూరు, జూలై 31, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు ప్రదర్శించి తీరు ఇప్పుడు దుమారం రాజేసింది. లింగపాలెం పంచాయతీ అధికారులు ఈ దారుణ ఘటనకు పాల్పడ్డారు. మూగజీవాలను అత్యంత పాశవికంగా, ఎలాంటి కనికరం చూపకుండా విషపు ఇంజక్షన్లతో చంపేశారు.ఒకటి, రెండు కాదు.. ఏకంగా 300 మూగజీవాలను పొట్టున పెట్టుకున్నారు. గుంతలో అలా పడేశారు. కనీసం మట్టి కూడా పూడ్చకుండా వదిలేశారు. ఇది చూసిన జంతు ప్రేమికులు కంటతడి పెట్టుకుంటున్నారు.విశ్వాసానికి మారుపేరు గ్రామసింహం. కొన్ని సందర్భాల్లో మనుషులపై దాడి చేయవచ్చు, తీవ్రంగా గాయపరచవచ్చు. అయితే మాత్రం అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తారా? వాటిని వదిలించుకునేందుకు ఏకంగా చంపేస్తారా? వాటిపై విషం చిమ్ముతారా అంటూ జంతు ప్రేమికులు మండిపడుతున్నారు. చనిపోయిన కుక్కల కళేబారాలను చెరువు వద్ద గొయ్యిలో పడేశారు. కనీసం మట్టి కూడా పూడ్చకుండా వదిలేశారు. కుక్కలను చంపే హక్కు ఎవరిచ్చారని ఫైట్ ఫర్ యానిమల్ ఆర్గనైజేషన్ ప్రశ్నిస్తోంది. ఈ చర్యలకు పాల్పడ్డ పంచాయతీ అధికారులపై ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.పంచాయతీ అధికారుల వెర్షన్ మాత్రం మరోలా ఉంది. కుక్కలు తరచూ దాడులకు తెగపడుతున్నాయి, ఎక్కడ పడితే అక్కడ గుంపులు గుంపులుగా పోగై రాకపోకలకు అంతరాయం కల్గిస్తున్నాయని చెప్తున్నారు. ఈ కారణంగా విషం పెట్టి చంపినట్లు చెప్తున్నారు. ప్రజారోగ్యం రీత్యానే ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు వివరిస్తున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది

# హేచరీ పై దాడి? మోటర్లు, పైపులు ధ్వంసం

విశాఖపట్నం జూలై 31, (న్యూస్ పల్స్)ప్రాయకరావుపేట మండలంలోని పాల్మన్ పేట పంచాయతీ పరిధిలో ఉన్న ఎన్ జి అర్ ఆక్వా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన మోటార్లు, పైపు లైన్లు ధ్వంసం చేశారు. అలాగే హేచరీ ప్రాంగణంలోని ఇళ్ళు, కార్యాలయంపై అర్ధరాత్రి రాళ్ళు విసిరి అద్దాలు పగుల గొట్టినట్లు హేచరీ యాజమాన్యం పోలీ సులకు పిర్యాదు చేసింది. ఈ విషయమై హేచరీ మేనేజర్ ఎ.రామిరెడ్డి మాట్లాడుతూ హేచరీ యాజమాన్యం పక్కనే ఉన్న రాజ్ వర్మ హేచరీని లీజ్ కు తీసుకుందని తెలిపారు. అప్పటి వరకు అందులో పనిచేసిన 16 మందికి వారు అడిగిన జీతాలు ఇవ్వలేక సెటిల్మెంట్ చేసినట్లు తెలిపారు. అయితే హేచరీ ఎలా నడిపిస్తారో చూస్తామంటూ ఇటీవల వారి నుంచి బెదిరింపులు వచ్చాయని తెలిపారు. రాత్రి మూడు గంటలు దాటిన తర్వాత కొంతమంది వచ్చి హేచరీలో ఉన్న ఇళ్ళు,కార్యాలయంపై రాళ్ళు వేశారని, హేచరి స్థలంలో ఉన్న మోటార్లు, పైపు లైన్లు ధ్వంసం చేశారని తెలిపారు. ఈ ఘటనపై పిర్ల గోపీతో పాటు మరో 15 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ పి.ప్రసాదరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై పాయకరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టీడీపీనేతల ఆరెస్టు..

విజయవాడ జూలై 31, (న్యూస్ పల్స్)కృష్ణాజిల్లా కొండపల్లి అటవీప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు అక్కడకు వెళ్తామని టీడీపీ నేతలు ప్రకటన చేయడంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ పర్యటించేందుకు అనుమతి లేదంటూ టీడీపీ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. తాము ఇప్పటికే అనుమతి కోరామని, నిజనిర్ధారణ చేయడానికి అధికారులను కూడా పంపాలని చెప్పామని, అయితే ఇందుకు ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వలేదని టీడీపీ నేతలు అంటున్నారు. కొండపల్లి అభయారణ్యంలో భారీ ఎత్తున అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగినప్పటికీ అటవీశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవట్లేదని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.కొండపల్లి అక్రమ మైనింగ్ పై టీడీపీ నియమిం చిన నిజ నిర్ధారణ కమిటీ 10 మందిలో 8 మందిని పోలీసులు నిర్బంధించగా ఇద్దరు సభ్యులు పోలీసుల అడ్డంకు లను, నిర్బంధాలను తప్పించుకుని ఆర్టీసీ బస్ లో టీడీపీ పార్టీ ఆఫీస్ కు చేరుకుంటున్నారని టీడీపీ తెలిపింది. ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేసింది. రాష్ట్రంలో ఈ పరిస్థితి నాటి ఎమర్జెన్సీ పాలనను తలపి స్తోందని, జగన్ ఎన్ని ఆటంకాలు కల్పించినా నిజ నిర్ధారణ కమిటీ కొండపల్లి వెళ్లి అక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్ పై నిజానిజాలను వెలికితీస్తుందని మాజీ ఎమ్మెల్యే అనిత అన్నారు.పోలీసులకు చిక్కకుండా ఆర్టీసీ బస్సులో వెళ్లిన వంగలపూడి అనిత.. ఈ సందర్భంగా బస్సులోనే వైసీపీ తీరుపై మండిపడ్డారు.

## కె యస్ యస్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అల్పాహారం పంపిణీ

నెల్లూరు స్థానిక కొత్తూరులోని అంబాపురం గిరిజన కాలనీ ప్రాంతంలో ఉన్నటువంటి నిరుపేదలకు కమల్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు టీ.వీ.ఎస్.కమల్ మాట్లాడుతూ ఈ భూమిపై ఎంతో మంది ఒక్కపూట కూడా ఆహారం దొరకకుండా ఆకలితో అలమటిన్నారని, కనీసం కొందరికైనా మా సేవాసమితి ద్వారా ఆకలి తీర్చడం మాకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు సురేష్ బాబు, జనార్ధన్, మాల్యాద్రి మరియు త్యాగు,నవీన్,రవీంద్ర, ధర్మరాజు,సునీల్,ఉదయ్,పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆరాచక పాలన కొనసాగుతుంది

నందిగామ జూలై 31,( విభారె) శనివారం ఉదయం మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ నందు జరిగిన అక్రమాల పరిశీలన, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గొల్లపూడిలో కలవడానికి వెళ్తుంటే పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన కొనసాగుతుందని మండిపడ్డారు. కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ లో జరిగిన అక్రమాన్ని తెలియజేయడానికి వెళుతున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులను ముందస్తుగా గృహనిర్బంధం ఎందుకు చేశారు. ప్రశ్నిస్తే కేసులు, మాట్లాడితే దాడులు. ఈ రోజు మీ అవినీతిని ఎత్తి చూపించారని దేవినేని ఉమామహేశ్వరరావు ను అక్రమ అరెస్ట్ చేసారు. తెలుగుదేశం పార్టీ 10 మంది సభ్యులతో నిజనిర్ధారణ కమిటీ అని చెప్పి ఒక కమిటీ వేస్తే మొన్న కొండపల్లి రిజర్వ్యర్ ఫారెస్ట్ వద్ద జరిగిన అక్రమాన్ని నిజాలు తెలియచెప్పడానికి కమిటీ సభ్యులు వెళ్తూ ఉంటే అందరిని గృహనిర్బంధాలు ఎందుకు చేశారు. ఎందుకు మీరు భయపడుతున్నారు నిజాలు బయటకి వస్తాయనా? పోలీస్ లను మీ గుప్పెట్లో పెట్టుకొని తెలుగుదేశం పార్టీ వారు ఎక్కడ బయటకు వస్తే మీ నిజాలు బయటకు వస్తాయో అని ముందుగానే ఎక్కడిక్కడ అరెస్ట్ లు,కేసులు ఇది మీ పరిపాలన. ఈ రోజు తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను,నాయకుల నోళ్లు నొక్కేసి ఒక హిట్లర్ పరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ రోజు పోలీస్ లు ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి స్టేషన్ లో కన్నా తెలుగుదేశం పార్టీనేతల ఇళ్లలో ఎక్కువగా ఉన్నారు .హౌస్ అరెస్ట్ అనే సంప్రదయంతో తెలుగుదేశం పార్టీ వాళ్ళ నోరు నొక్కేస్తున్నారు.ఇప్పటి ముఖ్యమంత్రి ఆనాటి ప్రతిపక్షనేత జగన్మోహన్ రెడ్డి గారిని మా అధినేత చంద్రబాబు నాయుడు గారు మీలాగా పరిపాలన చేసి ఉంటే మీరు రాష్ట్రము మొత్తం పాదయాత్ర చేసేవాళ్ళ? సాక్షి టివిలో చూపిస్తున్నారు దేవినేని ఉమామహేశ్వరరావు అరెస్ట్ ను తెలుగుదేశం పార్టీ వాళ్లే సమర్థిస్తున్నారు అని చూపిస్తున్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు.మరి నిన్న రాజమండ్రి కేంద్ర కారాగారంకు నందిగామ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు కదలి వెళ్ళాయి మరి మీ సాక్షి ఛానల్ వాళ్లకు అది తెలియదా? మీ సాక్షి ఛానల్ లో అవి ఎందుకు ప్రసారం చేయలేదు. రాజ్యాంగం కల్పించిన హక్కు సెక్షన్-3 వైసీపీ ప్రభుత్వం వచ్చాక దానిని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నది. జగన్ రెడ్డి గారు జైలుకు వెళ్లారు కాబట్టి తెలుగుదేశం పార్టీ నాయకులు అందరూ జైలుకు వెళ్ళాలి అనే విధంగా మీ పరిపాలన ఉన్నది. అభివృద్ధి లేదు, సంక్షేమం లేదు ఇటువంటి నీచమైన పరిపాలన ఎక్కడ చూడలేదు . తెలుగుదేశం పార్టీ వాళ్ళను మానసికంగా ఇబ్బంధి పెడుతున్నారు భూమి గుండ్రగా ఉంటుంది ఎల్లకాలం మీరే ఉండరు. ప్రభుత్వాలు మారతాయి. ఇప్పుడు మీరు చూపిస్తున్నారు తప్పకుండ మీకు కూడా ఇదే జరుగుతుంది ప్రజలు తిరగబడే రోజులు దగ్గరకు వచ్చాయి.ప్రజలే మీకు బుద్ధి చెప్తారని అన్నారు.

## ఆస్తి పన్ను పెంపుపై అయ్యన్న పాత్రుడు ధర్నా

నర్సీపట్నంజూలై 31,( విభారె) ఆస్తిపన్ను పెంపుపై మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడునిరసన ర్యాలీ , ధర్నా చేపట్టారు. కరోనా విపత్కర పరిస్థితిలో ఆస్తి పన్నులు పెంచడం దారుణమని అయన అన్నారు. అయ్యన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అయన అన్నారు. ఇతర రాష్ట్రాల్లో పన్నులు సగం మేర తగ్గిస్తుంటే, ఆంధ్రప్రదేశ్ లో మాత్రం వైసీపీ ప్రభుత్వం పన్నులను పెంచి వసూలు చేయడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా పన్నులు పెంచడం పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధమన్నారు. పన్నులు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లోని ఉన్న విలువ ఆధారంగా పెంచుతూ పోతే రిజిస్టర్ చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం ఖాళీ స్థలం, ఇంటి స్థలం తాలూకు విలువ పెరుగుతాది అంటే పన్నులు కూడా ఆ విలువతో పెరిగి పోతుంటే ఇంకా పన్నులు కట్టుకోలేక ఇళ్లు అమ్ముకోవలసిన పరిస్థితి వస్తుందన్నారు. నర్సీపట్నంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో పన్నులు తగ్గిస్తామని చెప్పి జగన్మోహన్ రెడ్డి, పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రజలను మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక టాక్స్ తగ్గించాలంటే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి తగ్గించాలి కానీ దొంగ జీవోతో ప్రజలను మభ్యపెట్టారన్నారు.ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ జీవోను రద్దు చేసి మళ్ళీ కొత్త జీవోను తెచ్చి ప్రజల పై మరింత భారం మోపడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు.ఈ వైసీపీ ప్రభుత్వం పన్నుల పెంపు నిర్ణయంపై అన్ని పార్టీలు కలిసి పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు.ఈ ర్యాలీలో టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు,అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

# దిశ ఆప్ పై విద్యార్థులకు అవగాహన

### విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై

తుగ్గలి జూలై 31,( విభారె) మండల కేంద్రమైన తుగ్గలి లోని స్థానిక అనసూయ విద్యాసంస్థల యందు శనివారం రోజున కరస్పాండెంట్ గుర్రాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో దిశ యాప్ పై ఎస్సై షామీర్ భాషా విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు అధికారులు దిశ యాప్ ను ఆచరణలోకి తీసుకొని వచ్చారని తుగ్గలి యస్.ఐ షామీర్ భాష తెలియజేశారు.దిశ యాప్ ను ఇంటర్నెట్ ద్వారా ప్లేస్టోర్ లో డౌన్లోడ్ చేసుకోవాలని,దిశ యాప్ వినియోగానికి ఎటువంటి ఇంటర్నెట్ సౌకర్యం అవసరం లేదని ఆయన తెలియజేశారు.ప్రస్తుత పరిస్థితులలో మహిళలు ఏమైనా ఆపదలో ఉన్నప్పుడు దిశా యాప్ లో ఉండే సేవలను వినియోగించి తమను తాము రక్షించుకోవడం అని ఎస్.ఐ తెలియజేశారు.మహిళలు ఏవైనా ఆపదలో ఉన్నప్పుడు దిశ యాప్లోని ఎస్.ఓ.ఎస్ (సేవ్ అవర్ సిస్టర్స్) బటన్ను నొక్కడం ద్వారా సమీపంలోని పోలీస్ స్టేషన్కు సమాచారం వెళ్తుంది,ఎస్.ఓ.ఎస్ బటన్ ను నొక్కినప్పుడు సంఘటనా స్థలం వద్ద వీడియో,ఆడియో చిత్రీకరణ ఆటోమేటిక్ గా జరుగుతుందని, అనంతరం లోకేషన్ ఆధారంగా పోలీసులు త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని ఆపదలను అడ్డుకుంటారని ఎస్.ఐ తెలియజేశారు.చెవిటి మరియు మూగ మహిళల సౌకర్యార్థం దిశ యాప్ ను ఓపెన్ చేసి గట్టిగా మూడు సార్లు కుదపడం ద్వారా కూడా సంబంధిత సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం వెళ్తుందని ఎస్ఐ తెలియజేశారు.దిశ యాప్ ద్వారా మహిళలకు ఎంతో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని,దిశా యాప్ ద్వారా అత్యవసరమైన మెడికల్,ఫైర్ తదితర వంటి సేవలను కూడా ఈ యాప్ ద్వారా వినియోగించుకోవచ్చని ఎస్సై షామీర్ భాష తెలియజేశారు.కావున మహిళలు దిశ యాప్ ను వినియోగిస్తూ,మరో నలుగురు మహిళలకు సమాచారం అందించాలని ఎస్ఐ షామీర్ భాష తెలియజేశారు.దిశ యాప్ ద్వారా కేసు నమోదైతే నిందితుడిపై 14 రోజుల్లో విచారణ నిర్వహించి,21 రోజులలోపు శిక్షను ఖరారు చేస్తారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది,మహిళా పోలీసులు సుశీల మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హాజీరా న్యాయపోరాట దీక్షకు మద్దతు - జనసేన

కర్నూలు జూలై 31,( విభారె) హాజీరా న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కేంద్రంలో అన్ని ప్రజాసంఘాలు కలిసి చేస్తున్న న్యాయ పోరాట దీక్షకు జనసేనపార్టీ రాష్ట్ర మహిళ సాధికారిక ఛైర్మెన్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జి రేఖగౌడ్ మద్దతు తెలిపారు, ఈ సందర్భంగా రేఖగౌడ్ మాట్లాడుతూ అత్యాచారానికి గురై ఏడాది అవుతున్న నిందితులను పట్టుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో ప్రభుత్వ యంత్రంగం ఘోరంగా విఫలమైందని తెలిపారు, గోనెగండ్ల మండల పరిధిలోని ఎర్రాబాడు గ్రామానికి చెందిన హాజీరాను పట్టపగలు అత్యాచారం హత్య చేసి ఆగస్టు నెలతో ఏడాది అవుతున్న న్యాయం జరగకపోవడం సిగ్గుచేటన్నారు, బాధిత కుటుంబం న్యాయం కోసం ధర్నాలు, దీక్షలు చేస్తూ నిరంతరం పోరాడుతున్న కేసు దర్యాప్తులో మాత్రం చలనం లేదన్నారు, ఒక సామాన్య కుటుంబం పడుతున్న కన్నీటి రోదనలు కనపడని ప్రభుత్వానికి గొప్పగా చెప్పుకొనే దిశ చట్టాలు ఎందుకని ప్రశ్నించారు, చట్టం న్యాయస్థానాలు ఉన్న అవి కఠినంగా లేకపోవడంతోనే నిందితులు తప్పించుకుంటున్నారని తెలిపారు, ప్రభుత్వం ఇప్పటికైనా నిందితులను గుర్తించి హాజీరా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, ఇప్పటికే మండల జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేసిన కదలికలు రాలేదని న్యాయం జరిగే వరకు ఆగిపోయే ప్రసక్తేలేదని

### నిందితులను పట్టుకోలేని దిశ చట్టాలు ఎందుకు రేఖగౌడ్

అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేద్దామని కుటుంబసభ్యులు అధైర్యపడొద్దని న్యాయం జరిగే వరకు కలిసి పోరాడుదమని జనసేనపార్టీ అండగా ఉంటుందన్నారు,

## ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### వాకాడు తహసీల్దార్ పద్మావతి

నెల్లూరు జూలై 31,( విభారె) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులను త్వరితగతిన పరిష్కరించి, చట్ట పరంగా వారికి అందాల్సిన అన్ని హక్కులను అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని వాకాడు తహసీల్దార్ పద్మావతి సూచించారు.తహశీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో వాకాడు మండలం జమీన్ కొత్తపాళెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో సివిల్ రేట్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టీ వర్గాల అణచివేతను అరికట్టేందుకుదుకు ప్రభుత్వం తీసుకువచ్చిన పిఓఎ చట్టం - 1989 ని తూచా తప్పకుండా అమలు చేయా లని సంబంధి తాధికారులను ఆదేశించారు.సమాజంలోఅంటరానితనాన్ని రూపు మాపాలని వక్తలు పిలుపునిచ్చారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన కమిటీ సమీక్ష సమా వేశం కోవిడ్ కారణంగా ఆలస్యంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.వైసిపి నాయకుడు మారం రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతోపాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

## విలేఖరులంతా క్షేమంగా ఉండాలి...

### విశ్వహిందూపరిషత్ కర్నూలు నగర అధ్యక్షులు డా.లక్కిరెడ్డి అమరసింహా రెడ్డి

కర్నూలు జూలై 31,( విభారె)నెల్లూరు ఆనందయ్య కరోనా మందు ను సమాచార ప్రసార శాఖ( డీ.పీ.ఆర్.ఓ) కార్యాలయం ప్రాంగణం లో ఈ రోజు ఉ. 11:00 గం.లకు విలేఖర సోదరులకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. గత సంవత్సరంన్నర కాలంగా మహమ్మారి కరోనా ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న సందర్భంలో మొదటి వరుస యుద్ధం వీరులైన డాక్టర్,పోలీస్,పారిశుద్య సిబ్బంది తో పాటు సమాచార,ప్రసారాలను ప్రజలకు చేరవేస్తూ,ప్రభుత్వాలు చేసిన నిర్ణయాలను,పగలనక రాత్రనక ఎప్పటి కప్పుడు అత్యవసర పరిస్థితులలో కూడా ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించక సమాచారాన్ని ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ప్రజలకు అందించే పత్రిక,ఎలక్ట్రానిక్,యూట్యూబ్ ఛానళ్ళ విలేఖర మిత్రులు కరోనా బారిన పడకుండా ఉండాలని అందుకే విశ్వహిందూ పరిషత్ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు కర్నూలు నగరం లో ఆనందయ్య కరోనా మందును పంపిణీ చేస్తున్నామన్నారు.కార్యాధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలలో విలేఖర సోదరులను మొదటి వరుస యుద్ధం వీరులు గా( ఫ్రంట్లైన్ వారియర్స్) గా గుర్తిస్తున్నారనీ ఆంధ్రప్రదేశ్ లోని విలేఖరసోదరులను కూడా గుర్తించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు,

## తూ.గో జిల్లా నూతన కలెక్టర్ గా హరి కిరణ్

కాకినాడ జూలై 31,( విభారె)నూతన జిల్లా కలెక్టర్ గా చేవూరి హరి కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారి కోసం. రైతుల కోసం పని చేయటం జరుగుతుంది. అని శాఖలను కలుపుకుని ముందుకు వెళ్తాను. రాజకీయ నాయకులందరిని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తాను. 2011 లో భద్రాచలం లో పని చేసాను. రాయలసీమలో ఎక్కువ కాలం పని చేసాను. మరల జిల్లాకు రావటం అదృష్టం. బాల్యంలో కాకినాడలో గడిపాను.

# థియేటర్ల వ్యవస్థపై నాని సంచలన వ్యాఖ్యలు



మాల్స్ పబ్బులకు వెళ్లి మాస్కులు తీసి ఎంజాయ్ చేసేవాళ్ల కంటే థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేవాళ్లే సురక్షితం! అంటూ నేచురల్ స్టార్ నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. సత్యదేవ్ - ప్రియాంకా జవాల్కర్ జంటగా శరణ్ కొప్పిశెట్టి తెరకెక్కించిన 'తిమ్మరుసు' ప్రమోషనల్ కార్యక్రమంలో నాని పైవిధంగా కామెంట్ చేశారు. ఈ వేడుకలో నాని ఇంకా ఏమన్నారంటే.. ?చాలా మంది పబ్లులు క్లబ్బులు మాల్స్ కి వెళ్లి అక్కడ మాస్కులు తీసేసి గొప్పగా మాట్లాడుతున్నారు. దానికంటే థియేటర్లలో కూచున్న ఆడియెన్ చాలా సురక్షితం. అక్కడా మాస్క్ రూల్ ని పాటిస్తున్నారు. పైగా ఒకేవైపు అంటే తెరవైపు మాత్రమే చూస్తారు. పక్కవాళ్లతో మాట్లాడరు. కానీ థియేటర్లు అంటు చిన్న చూపు. కరోనా వస్తోందని.. అన్నిటి కంటే ముందు మూసేసేది థియేటర్లు... చివరిలో తెరిచేది కూడా థియేటర్లే. ఈ చిన్న చూపు ఎందుకు? అన్నిటితో పాటే వీటిని తెరవొచ్చు కదా! అని ప్రశ్నించారు.పరిస్థితి ఇలానే ఉంటే థియేటర్ల వ్యవస్థ నాశనం అవుతుంది. లక్షలాది కార్మికులు రోడ్డున పడతారు. ఉపాధి పోయింది. ఎగ్జిబిషన్ రంగం కుప్ప కూలుతుందని నాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం థియేటర్లలోకి వస్తున్న తిమ్మరుసు థియేటర్లకు ఆక్సిజన్ ఇవ్వాలని కోరుకుంటున్నానని నాని అన్నారు. సినిమా అనేది మనకు ఎంతో వినోదం ఇస్తుంది. వినోదం ఎక్కువగా ఉంటే ఆ దేశంలో ప్రజలు ఆనందంగా ఉంటారు. థియేటర్లో సినిమా చూడటం అనేది మన సంస్కృతిలో భాగం. ఇంట్లో ఆ తర్వాత థియేటర్లలోనే ఎక్కువగా గడిపాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆరోగ్యం చాలా ముఖ్యం. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సినిమాని ఆస్వాదిద్దాం. థర్డ్ వేవ్ లాంటివి రాకుండా.. అన్ని సినిమాలను థియేటర్ లలో అందరం కలిసి ఆస్వాదించాలని కోరుకుంటున్నా అని నాని అన్నారు.మొదటినుంచి సత్య అంటే చాలా ఇష్టం. ఎప్పుడో ప్రయాణం మొదలు పెట్టి హీరోగా ఎదుగుతున్నాడు. సత్య ఎంత మంచి నటుడో మనందరికీ తెలుసు. తిమ్మరుసుతో ఒక స్టార్ గా ప్రయాణం మొదలుపెట్టబోతున్నాడు... ఈ సినిమా విజయం సాధించాలి.ట్రైలర్ దూసుకెళుతోంది..ఇటీవల విడుదలైన టీజర్లు పాటలకు మంచి స్పందన లభించింది. ఎన్టీఆర్ విడుదల చేసిన తిమ్మరుసు ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో బ్రహ్మాజీ- అజయ్- ప్రవీణ్ - ఆదర్శ్ బాలకృష్ణ- ఝాన్సీ తదితరులు నటించారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు.నాని వ్యాఖ్యలకు స్పందిస్తారా?థియేటర్ల వ్యవస్థ ఇలానే ఉంటే నాశనమవుతుందని నాని చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వాలు సీరియస్ గా వినే ప్రయత్నం చేస్తాయా? ఇటు తెలంగాణలో సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ చొరవతో కొంతవరకూ వెసులుబాటు కల్పించారు. 100 శాతం ఆక్యుపెన్సీతో థియేటర్లు తెరుస్తున్నారు. సింగిల్ థియేటర్లకు పార్కింగ్ ఫీజు వెసులుబాటు కల్పించారు. మరిన్ని సౌకర్యాలు అమల్లోకి వస్తాయి.కానీ ఏపీలో మాత్రం వైయస్ జగన్ ప్రభుత్వం థియేటర్ల సమస్యలపై ఇన్నాళ్లు స్పందించకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అక్కడ సవరించిన టిక్కెట్టు రేట్లతో సినిమాలు ఆడడం అంత సులువేమీ కాదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాత టిక్కెట్టు ధరలనే ఏపీలోనూ కొనసాగిస్తే థియేటర్లు మనుగడ సాగిస్తాయని చెబుతున్నారు. మరి హీరో నాని ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటారా? ఎగ్జిబిటర్ల మీటింగులు సినీపెద్దల సమావేశాలు అన్నీ అయిపోయాయి.




# పబ్లిక్ ఒపీనియన్: టాలీవుడ్ మోస్ట్ హ్యాండ్సమ్ హీరో..?

పాన్ ఇండియా సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్న టాలీవుడ్ హీరోలు.. ఇప్పుడు ఇండియన్ బాక్సాఫీస్ ని శాసించే స్థాయికి చేరుకుంటున్నారు. స్టార్డమ్ లో ఫ్యాన్ ఫాలోయింగ్ లో బాలీవుడ్ స్టార్స్ కు ఏమాత్రం తీసిపోమని నిరూపిస్తున్నారు. యాక్టింగ్ పరంగానే కాకుండా అందంలో కూడా తెలుగు హీరోలు క్రేజ్ ఏర్పరచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టాలీవుడ్ లో మోస్ట్ హ్యాండ్సమ్ హీరో ఎవరు అనే దానిపై పబ్లిక్ ఒపీనియన్ తెలుసుకోడానికి 'తుపాకీ డాట్ కామ్' ఓ పోల్ నిర్వహించింది. ఇందులో మహేష్ బాబు - ప్రభాస్ - విజయ్ దేవరకొండ పేర్లను ఉంచడం జరిగింది. ఈ పోల్ ప్రకారం టాలీవుడ్ మోస్ట్ హ్యాండ్సమ్ హీరో ఎవరో ఇప్పుడు చూద్దాం! సూపర్ స్టార్ మహేష్ బాబు కు మించిన అందగాడు టాలీవుడ్ లో లేరని ఆడియన్స్ ఈ పోల్ ద్వారా




చెబుతున్నారు. మొత్తం పోలైన ఓట్లలో 57.28% మంది మోస్ట్ హ్యాండ్సమ్ హీరో మహేష్ అంటూ.. ఆయన్ని ఫస్ట్ ప్లేస్ లో నిలిపారు. నటశేఖర కృష్ణ వారసుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన మహేష్.. హాలీవుడ్ హీరోని తలదన్నే అందగాడు అనిపించుకున్నాడు. మరి కొన్ని రోజుల్లో 46 ఏట ఎంటర్ అవుతున్న మహేష్.. లుక్స్ పరంగా తన కొడుకు గౌతమ్ కు అన్న అనుకునే విధంగా కనిపిస్తుంటాడు. అందుకే ఈ పోల్ లో ఎక్కువ శాతం అతన్నే అందగాడిగా తేల్చేశారు.యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇందులో 19.61% ఓట్లతో రెండో స్థానంలో ఉన్నారు. 'బాహుబలి' సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్.. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అయిన డార్లింగ్.. హ్యాండ్సమ్ లుక్స్ తో అందరినీ ఆకట్టుకుంటున్నారు. అందుకే ఇటీవల విడుదలైన 'మోస్ట్ హ్యాండ్సమ్ ఏషియన్ మెన్-2021' జాబితాలో చోటు దక్కించుకున్నాడు. పది మందితో కూడిన ఈ లిస్ట్ లో ప్రభాస్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచాడు. అయితే తెలుగు ఆడియన్స్ మాత్రం ప్రభాస్ ను మించిన అందగాడు మహేష్ అని ఈ పోల్ ద్వారా చెబుతున్నారు.సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ టాలీవుడ్ మోస్ట్ హ్యాండ్సమ్ హీరో అని 15.31% మంది అంటున్నారు. 'పెళ్లి చూపులు' సినిమాతో పూర్తి స్థాయి హీరోగా మారిన వీడీ.. తన క్రేజ్ పెంచుకుంటూ వెళ్తున్నాడు. 'అర్జున్ రెడ్డి' తో యూత్ లో ఫాలోయింగ్ తెచ్చుకున్న విజయ్.. నేషనల్ వైడ్ క్రేజ్ సాధించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇటీవల హైదరాబాద్ టైమ్స్ మోస్ట్ డిజైరబుల్ మ్యాన్ టైటిల్ ను వరుసగా మూడోసారి సాధించి సెన్సేషన్ క్రియేట్ చేసాడు. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాతో తన సత్తా ఏంటో చూపించాలని ఎదురు చూస్తున్నాడు. ఇక ఈ పోల్ లో 7.81% మంది మాత్రం ఈ ముగ్గురిలో ఎవరు హ్యాండ్సమ్ అనేది చెప్పలేమని అంటున్నారు.

# సంక్రాంతికి ఇంకో పుంజుని రెడీ చేస్తున్నారా..?

టాలీవుడ్ లో సంక్రాంతి సీజన్ లో సినిమాల మధ్య ఉండే పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారీ వసూళ్లను టార్గెట్ గా పెట్టుకొని స్టార్ హీరోలందరూ పెద్ద పండక్కి రావాలని చూస్తుంటారు. దశాబ్దాల నుంచి సంక్రాంతి పండుగ సమయంలో బాక్సాఫీస్ వద్ద పెద్ద హీరోల సినిమాలు బరిలో దిగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది మాత్రం కరోనా వైరస్ ప్రభావం కారణంగా స్టార్ హీరోల సినిమాలేవీ విడుదల కాలేదు. కానీ ఈసారి సంక్రాంతి మాత్రం టాలీవుడ్ లో రసవత్తరంగా ఉండబోతోందని సంకేతాలు వస్తున్నాయి.2022 సంక్రాంతి బెర్తుల కోసం ఇప్పటికే రెండు సినిమాలు కర్చీఫ్ లు వేశారు. గతేడాది 'సరిలేరు నీకెవ్వరు' సినిమాతో సరిలేరు అనిపించుకున్న సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఈసారి అందరి కంటే ముందుగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం పరశురామ్ పెట్లా దర్శకత్వంలో నటిస్తున్న 'సర్కారు వారి పాట' చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.లేటెస్టుగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా 'ఛఖూఖఐఖీజీనిజీ' సినిమాతో రేసులోకి వచ్చేసాడు. రానా దగ్గుబాటి తో కలిసి నటిస్తున్న 'అయ్యప్పనుమ్ కొశీయుమ్' తెలుగు రీమేక్ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. సాగర్ కె. చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే - డైలాగ్స్ అందిస్తున్న సంగతి తెలిసిందే.ఇప్పుడు సంక్రాంతి పండుగ కోసం మరో పందెం పుంజును రెడీ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'రాధే శ్యామ్' చిత్రాన్ని ఫెస్టివల్ సీజన్ లో తీసుకురావాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ గురువారానికి పూర్తి అయింది. ఈ క్రమంలో మరో మూడు రోజుల్లో అఫిషియల్ అప్డేట్ రాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ నేపథ్యంలో 'రాధే శ్యామ్' నుంచి రాబోతున్న అప్డేట్ లో సంక్రాంతి రిలీజ్ గురించి ప్రకటన ఉంటుందని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190